


# బాలనాగమ్మ

అనగా అనగా నవాభోజరాజనే ఒక రాజు. ఆయన చక్రపట్టణం ఏలుతూ ఉండేవాడు. ఆయన భార్యపేరు లక్ష్మమ్మ. ఆవిడ చాలా దొడ్డ ఇల్లాలు. కాని, పాపం, ఆమెకు పిల్లలు లేరు. పిల్లలకోసం ఆమె ఎన్నో నోములు నోచింది, ఎన్నో వ్రతాలు పట్టింది, పేద బ్రాహ్మలకు వడుగులూ పెళ్లిళ్లూ చేయించింది. చలివేంద్రాలు పెట్టించింది. అన్నదానాలు చేయించింది. నూతులూ చెరువులూ తవ్వించింది. ఎన్నో తీర్థయాత్రలు చేసింది. కాని, పిల్లలు కలగలేదు. "ఎంత ధనముండి ఏంలాభం? పిల్లలులేని జన్మ ఏమి జన్మ? ఆడది గొడ్డుమోతు అని అనిపించుకునేకన్న ఏ అడవిలోనో మానైపుట్టటం మంచిది," అనుకున్నది లక్ష్మమ్మ.

చక్రపట్టణానికి కొంత దూరంలో జటంగముని పర్వతం ఉన్నది. అక్కడికి పోయి కఠోరమైన తపస్సుచేసి పిల్లలను కనే వరం సంపాదించాలని లక్ష్మమ్మ దీక్ష పట్టింది. మహారాజు ఆమెకు ఎన్నివిధాలో చెప్పి చూశాడు. కాని లాభం లేకపోయింది.

సంతానంకోసం తన భార్య ఎన్ని కష్టాలైనా పడటానికి సిద్ధంగా ఉన్నదని గ్రహించి, నవాభోజరాజు ఆమె తపస్సుకు అనుమతించాడు. ఊరంతా అలంకరించారు. నాలుగువీథులా తోరణాలు కట్టారు. ముగ్గులు పెట్టారు. లక్ష్మమ్మ పచ్చలపల్లకీ ఎక్కి కూర్చున్నది. పన్నెండు వందల బలగం వెంటరాగా రాణీగారి పల్లకీ రాచనగరునుంచి సాగింది.

లక్ష్మమ్మ పన్నెండామడ ప్రయాణం చేసి జటంగముని పర్వతం చేరింది. అక్కడ తనవెంట వచ్చిన బలగాన్ని నిలిపి, ముగ్గురు దాదులను మాత్రం వెంట బెట్టుకుని ఆమె పర్వతం ఎక్కసాగింది



అలవాటులేక ఆమె కాళ్లు బొబ్బలెక్కిపోయాయి. అయినా ఆమె అన్ని బాధలూ ఓర్చి పర్వతంఎక్కి జటంగముని తపస్సు చేసుకునేచోటికి వచ్చింది.

ఆ ముని ఎట్లా ఉన్నాడు! ఆయన చుట్టూ చెట్లూ, తీగెలూ అల్లుకుపోయాయి. ఆయన వంటిమీదనే పక్షులు గూళ్లు కట్టుకున్నాయి. లక్ష్మమ్మ ఆయన్ని చూస్తూనే భక్తితో సాష్టాంగ పడింది.

కాని మహాముని ఆమెను పలకరించలేదు. ఆయనను పలకరిస్తే శపిస్తాడేమోనని లక్ష్మమ్మకు భయం కలిగింది. అందుచేత. ఆయనచేత మాట్లాడించటానికి లక్ష్మమ్మ ఒక మంచి ఆలోచన చేసింది. రెండు పొయిరాళ్లు పెట్టి, కుండలో నీళ్లూ బియ్యమూ పోసి పొయిమీద పెట్టి, తన మోకాలు మూడో రాయిగా పెట్టి, కింద నిప్పుచేసింది. మంట కాస్త పెద్దదికాగానే ఆమె మోకాలు కాలింది. కాలగానే ఆమె మోకాలు లాక్కుంది. మోకాలు లాక్కోగానే కుండ ఒరిగి పడిపోయింది. అందులో బియ్యమూ, నీళ్లూ కింద ఒలికిపోయాయి.

లక్ష్మమ్మ రెండు మూడు సార్లు ఈ విధంగా చెయ్యటం జటంగముని కంట బడింది. "అయ్యో, పాపం, గొప్పయింటి బిడ్డలాగా ఉంది; అన్నం వండటమైనా చాతకాదు కాబోలు. ఈమెకు సహాయం చెయ్యకపోతే నా తపస్సంతా బూడిద పోసిన పన్నీరవుతుంది," అనుకుని ఆ మహాముని లక్ష్మమ్మతో, "అమ్మా, మూడు రాళ్లు పెడితేగాని కుండ నిలవదు. కుండ నిలిస్తేగాని అన్నం ఉడకదు," అన్నాడు.

మహాముని పలకగానే లక్ష్మమ్మ, "స్వామీ! మీ పలుకులు నా చెవిన పడగానే నా పాపాలన్నీ పోయాయి," అంటూ తన కథ అంతా ఆయనకు విన్నవించింది.


అంతావిని జటంగమహాముని, "అమ్మా నీకు పిల్లలు కలిగే గీత బ్రహ్మ వ్రాయ లేదు," అన్నాడు.

ఈమాట వినగానే లక్ష్మమ్మ మొదలు నరికిన చెట్టులాగ కూలిపోయి శోకించ సాగింది. మునికి ఆమెమీద చాలా జాలి కలిగింది. ఆయన దివ్యదృష్టితో చూసి, లక్ష్మమ్మకు పిల్లలుమాత్రం పుడతారనీ, ఐతే ఆడపిల్లలు పుడితే తల్లికి గండమనీ, మగపిల్లలు పుడితే తండ్రికి గండమనీ తెలుసుకున్నాడు. కాని యీమాట ఆమెతో చెప్పలేదు.



"అమ్మా, ఇక్కడికి ఈశాన్య మూలగా నాగేంద్రుడి గట్టున్నది. ఆ గట్టుమీద నాలుగు మద్దిమాను లున్నాయి. ఆ మద్ది చెట్ల మధ్య ఉండే చవరంలో నాగేంద్రుడి పుట్ట ఉన్నది. ఆ పుట్టలో ఆదిశేష లున్నాడు. పుట్టమీదుగా ఒక బాలమామిడి చెట్టున్నది. ఆ చెట్టుకు ఎన్నో కాయ లున్నాయి. నువు అక్కడికి వెళ్లి, పుట్టకు ప్రదక్షిణంచేసి దణ్ణంపెట్టుకుని, ఆ చెట్టున ఏడుపళ్లు కోసుకో. తిరిగి ఇంటికి వెళ్లి, సూర్యనదిలో స్నానంచేసి ఆ ఏడువళ్ల రసమూ పిండుకుని తాగితివా నీకు పిల్లలు పుడతారు," అని జటంగమహాముని లక్ష్మమ్మతో చెప్పాడు.

మహాముని చెప్పినప్రకారం లక్ష్మమ్మ నాగేంద్రుడిగట్టుకు వచ్చింది. చుట్టూ మద్దిమానులు. మధ్య పుట్ట. పుట్టమీదుగా బాలమామిడిచెట్టు. చెట్టునిండా కాయలు విరగగాచి ఉన్నవి. లక్ష్మమ్మ పుట్టచుట్టూ ప్రదక్షిణంచేసి చెట్టెక్కింది. ఆశకొద్దీ ఒడి నిండా కాయలు కోసుకుని దిగి వచ్చింది. కిందికి దిగి చూసుకునేసరికి ఏడుకాయలే ఉన్నాయి. ఆమెకు తృప్తి కలుగలేదు. రెండోసారి మళ్లీ చెట్టెక్కి అందినకాయలన్నీ



కోసుకుని దిగివచ్చి చూసుకుంది. ఎన్ని కాయలు కోసుకున్నా ఒడిలో ఏడు కాయలే ఉన్నవి. మళ్లీ మూడోసారి లక్ష్మమ్మ చెట్టెక్కి కాయలు కోయసాగింది.

ఇంతలో ఒక్కసారిగా భూమి కంపించింది. పుట్టలోనుంచి బుసలు కొట్టుకుంటూ పన్నెండుతలల నాగేంద్రుడు చెట్టెక్కి రాసాగాడు. లక్ష్మమ్మ భయంతో కంపించిపోయింది.

"ఈ చెట్టుకు నేను కావలి ఉండగా నా అనుమతి లేకుండా చెట్టు ఎట్లా ఎక్కావు? నిన్నిప్పుడే కాటేస్తాను," అన్నాడు కోపంతో నాగేంద్రుడు.

"అయ్యో, తండ్రీ! నాగేంద్రుడా! నా కోరిక యింకా తీరకముందే నన్ను చంపేస్తావా? సంతానంకోసంకదా నేను ఇన్ని పాట్లూపడింది. నాకు పిల్లలుపుట్టిన తొమ్మిది నెలలకి శేషపౌర్ణమినాడు వచ్చి నన్ను చంపుకుపో. అంతవరకూ నన్ను బతికి ఉండనీ" అని వేడుకున్నది లక్ష్మమ్మ.

"అయితే ఇప్పటికి నిన్ను వదిలేస్తాను. నువ్వు వెళ్లి ఏడుగురు ఆడపిల్లల్ని కను. ఆఖరు పిల్లకు బాలనాగమ్మ అని నాపేరు పెట్టుకో. ఆడినమాట మాత్రం తప్పవద్దు."

లక్ష్మమ్మ. "అయ్యో, నాయనా! అందరూ ఆడపిల్లలేనా? ఒక మగపిల్లవాణ్ణి అయినా కనికరించవా?" అని వేడుకున్నది.

"నీకు మగపిల్లలు కలిగినట్టయితే నీ భర్త ప్రాణం దక్కదు," అన్నాడు నాగేంద్రుడు.

"అట్లా అయితే ఆడపిల్లలనే ఇయ్యి, స్వామీ! నా సంతోషంకోసం ఒకరి ప్రాణం ఎందుకు పోవాలి? ఆడపిల్లలయితే మాత్రం నవాభోజరాజు కూతుళ్లు అనకపోతారా?" అన్నది లక్ష్మమ్మ. పిల్లలు పుట్టిన తొమ్మిది నెలలకు నాగేంద్రుడికి కాటుయిస్తానని ప్రమాణం చేసింది. నాగేంద్రుడు పుట్టలోకి తిరిగి పోయినాడు.

లక్ష్మమ్మ తన ఒడిలో ఉన్న ఏడుపళ్లూ చూసుకుని తనకు బ్రహ్మ అంతే వ్రాశా డనుకున్నది. జటంగ పర్వతం దిగి వచ్చి తన పరివారాన్ని కలుసుకున్నది. అందరూ కలిసి చక్రపట్టణం ప్రయాణమైనారు.

మహారాణి ఫలంపొంది తిరిగి వస్తున్న దని వినగానే రాజు పరమానందభరితు డయినాడు. రాణీకి ఎదురుగా పల్లకీలూ బాజా భజంత్రీలూ పంపాడు. ఆమెను అన్నివీధులూ ఊరేగించారు.



రాచనగరుకు తిరిగివచ్చిన మర్నాడు లక్ష్మమ్మ స్నానంచేసి, ఒక బంగారు గిన్నెలో ఏడు మామిడిపళ్ళ రసమూ పిండుకున్నది. జటంగ మహాముని నీ, నాగేంద్రుణ్ణీతలచుకుని ఆరసం తాగేసింది. అది తాగిన ఆరు గడియలకల్లా ఆమెకు గర్భిణి చిహ్నాలు అగుపించాయి. చర్మం పాలిపోయింది. వేవిళ్ళు కలిగాయి. ఏడో గడియకెల్లా లక్ష్మమ్మ నొప్పులుపడ నారంభించింది. మూడువందల మంది మంత్రసానులు వచ్చి మహారాణికి కాన్పు చేయించారు. ఏడు గడియలలోపల ఏడుగురు ఆడపిల్లలు కలిగారు. పిల్లలు కలిగిన సంతోషముతో నవాభోజరాజు పట్టణమంతటా కండచక్కెరా, పంచదారా, వక్కలాకులూ పంచిపెట్టించాడు.

ఆడపిల్లలకు మూడో నెల వెళుతుండగా రాజు బ్రహ్మాండంగా ప్రజలకు సంతర్పణలూ అన్నదానాలూ చేయించి, బ్రాహ్మలచేత పిల్లలకు నామకరణం చేయించాడు. సూర్యనాగమ్మ, చంద్ర నాగమ్మ, పగడాల నాగమ్మ, ఉత్తర కన్యక, దక్షిణకన్యక, మునికన్యక, బాల నాగమ్మ అని ఏడుగురికీ పేర్లుపెట్టారు.




లేకలేక కలిగిన తన ఏడుగురు పిల్లల ముద్దు మురిపాలు చూసుకుంటూ, అచ్చట్లూ ముచ్చట్లూ చేసుకుంటూ, రోజులు క్షణాలుగా గడిపివేసిందిలక్ష్మమ్మ. తొమ్మిది నెలలూ ఎట్లా గడిచాయో ఆమెకే తెలియదు. ఒకరోజున ఆమె బ్రాహ్మణ్ణి పిలిచి "శేషపౌర్ణమి ఇంకా ఎన్నాళ్ళుంది?" అని అడిగితే మూడురోజు లుందన్నాడు.

లక్ష్మమ్మకు వొళ్లు ఝల్లుమన్నది. ఇక మూడురోజులకి తనకూ పిల్లలకీ ఋణం తీరి పోతుంది. ఆనాడు నాగేంద్రుడు వచ్చి తన ప్రాణం పుచ్చుకుంటాడు. తను పోయినాక తన పిల్లల్ని ఎవరు దగ్గరికి తీస్తారు, ఎవరు చేస్తారు? తన భర్త మళ్ళీ పెళ్లాడితే ఆ రెండో భార్య ఈ పిల్లలకు సరిగా అన్నం పెడుతుందా, నీళ్ళు పోస్తుందా? వాళ్ళు దిక్కులేని పక్షులైపోతారే అని లక్ష్మమ్మ ఘోరున ఏడ్చింది.

ఆతర్వాత రాజుకు పిల్లలను అప్పగించి జరిగిన కథంతా చెప్పింది తనభార్యకి ఇక భూమిమీద మూడురోజులే గడువుందని తెలియగానే రాజు కుప్పగాకూలిపోయాడు.

రాజుగారి విచారంచూసి మంత్రులు, "మహారాజా! ఈ భాగ్యానికి మీరింత




దుఃఖించాలా? మహారాణీగారికి ఎటువంటి ఆపదా రాకుండా మేము అన్ని ఏర్పాట్లూ చేస్తాము'' అని ధైర్యం చెప్పారు.

నడివీధిలో ఏడేసి స్తంభాలు రెండు పాతారు. వాటికి అడ్డంగా ఒక దూలం కట్టారు. దానికి ఒక బంగారు ఉయ్యాల తొట్టికట్టారు. అందులో లకమ్మను పడుకోబెట్టి మూతవేసి మూడుతాళాలు వేశారు. స్తంభాలచుట్టూ నిప్పుగుండాలు తవ్వారు. వాటిలో నూనెపోసి పెద్ద మంటచేశారు. పట్టణవీథుల ముఖద్వారాల దగ్గిర కత్తుల బోనులు ఏర్పాటుచేశారు. తుపాకులతోనూ, విచ్చుకత్తులతోనూ ఆరువందల మంది భటులను కాపాలా ఉంచారు స్తంభాలవద్ద పురాణపఠనంసాగించారు. ఇకనాగేంద్రుడు ఎట్లా వస్తాడు? లక్ష్మమ్మను ఏంజేస్తాడు?

శేషపౌర్ణమి వచ్చింది. కరకరా సూర్యుడుదయించాడు. అన్న మాట ప్రకారం లక్ష్మమ్మ రాలేదు. పుట్టలోని నాగేంద్రుడికి కోపం వచ్చింది. పన్నెండు తలలతోటి బుసలుకొడుతూ, నిప్పులు కక్కుతూ పుట్టలోంచి నాగేంద్రుడు బయటికి వచ్చాడు. క్షణంలో భూచక్రపట్నం చేరి, తనను చంపటానికి చేసిన ఏర్పాటంతా చూశాడు. ఆయన అక్కడే అంతర్ధానమై, లక్ష్మమ్మను పెట్టిన తొట్టిలో ప్రత్యక్షమైనాడు.

"దుర్మార్గురాలా! నాకు మాట యిచ్చి తప్పుతావా? నన్ను చంపించటానికి ఇన్ని ఏర్పాట్లు చేస్తావా?" అన్నాడు నాగేంద్రుడు.

"ఇది నా తప్పుకాదు, తండ్రీ! వాళ్ళు పాపులు. అందుచేత నిన్ను మోసంచేశారు. నీ కోరిక తీర్చటానికి నేను సిద్ధంగానే ఉన్నాను" అన్నది లక్ష్మమ్మ. వెంటనే ఆమెకు తనకూతుళ్లు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళు తల్లిలేని పిల్లలవుతారనే దుఃఖంతో ఆమె మూర్ఛపోయింది. [ఇంకావుంది]






కొంత సేపటికి లక్ష్మమ్మకు మూర్ఛతెలిసి, "నన్నిక్కడ ఎందు కుంచారు?" అని పెద్ద కేక పెట్టింది.


ఈ కేక కావలివాళ్లు విన్నారు. వారికి ధైర్యం కలిగింది. నాగేంద్రుడు వచ్చే గడువు దాటిపోయింది. రాణిగారు బతికిం దన్నారు. తొట్టి కిందికి దించారు. తాళాలు తీసి మూతతీసారు. లోపల నెత్తురుమయం! అందరికీ ఒక్కసారి గుండె ఆగిపోయింది. రాజుగారు బాకుతీసి పొడుచుకుని చావ పోయినాడు. కాని, మంత్రులు ఆయనకు అడ్డుపడి, "ఆగవయ్యా, రాజా! పాము కరిచినవా రంతా చచ్చి పోయారా? మన దగ్గిర మహామంత్రవేత్త లున్నారు. రాణీ గారు తప్పక బతుకుతారు" అన్నారు.

మంత్రగాళ్లు వచ్చి అట్టహాసంగా మంత్రాలు చదవసాగారు.

రాణిగారు కళ్లు తెరిచి రాజును దగ్గిరికి పిలిచింది. ఆయన చెయ్యి పట్టుకుని, "మహారాజా! ఎందుకు వృథాశ్రమ పడు తారు. నాకు చావు సమీపించింది. నేను పోతాను. మీరు మళ్లీ పెళ్లాడనని నాకు ప్రమాణం చెయ్యండి. పాలూ అన్నమూ ముట్టుకుని ప్రమాణం చెయ్యండి. మీరు మళ్లీ పెళ్లాడితే మారుతల్లి నా పిల్లలకు అన్నం పెట్టదు, నీళ్లు పొయ్యదు. కడుపెడు పిల్లల్ని మీకు వప్పగించి పోతున్నాను. మీకు మళ్లీ పెళ్లాడా లనిపిస్తే వాళ్లకు పెళ్లిళ్లుచేసి, అత్తవారిళ్లకుపంపి, ఆతరవాత పెళ్లాడండి" అన్నది.

"నేను అసలు పెళ్లే అడ" నని రాజు ప్రమాణంచేశాడు.

పాపం, లక్ష్మమ్మకు ఆఖరుసారి పిల్లల్ని చూసేభాగ్యం లేకపోయింది. తల్లిని చూచి



దడుసుకుంటారని వాళ్ళను దగ్గిరికి రానివ్వ లేదు. ఎన్నేళ్లో 'పిల్లలో', పిల్లలో' అని తపించిన ఆ మహాలక్ష్మమ్మ తల్లి, ఏడుగురు కూతుళ్లను కనికూడా, వాళ్ళ అచ్చట్లూ ముచ్చట్లూ చూసుకోకుండా, వాళ్లనే స్మరిస్తూ ప్రాణం విడిచింది.

లక్ష్మమ్మచావుకు ఊరంతా గొల్లున ఏడ్చింది. ఆమె శవాన్ని మంచి గంధపు చెక్కలతో దహనంచేసి రాజు యింటికి తిరిగి వచ్చాడు. పిల్లలు తల్లిని తలుచుకోకుండా ఎంతో జాగ్రత్తగా పెంచసాగాడు.

కొంతకాలం గడిచింది. నవాభోజరాజు తానే తన బిడ్డలకు తండ్రీ, తల్లీ అయి వాళ్లను సాకుతున్నాడు. పట్నంలో ఉన్న కాపులూ, కరణాలూ, రాజబంధువులూచేరి రాజుగారిని మళ్లీ పెళ్లి ఆడమని అడిగారు. రాజు ఒప్పలేదు. మంత్రులు కూడా చెప్పి చూశారు. లాభం లేకపోయింది.

చివరకుమంత్రులొక ఉపాయంచేశారు. ఏడుగురు కూతుళ్ళనూ చాటుగా పిలిచి, "మేము చెప్పితే మీ నాన్నగారు వినకుండా ఉన్నారు. ఆయనను మళ్లీ పెళ్లి ఆడమని మీరు చెప్పండి. మీకు ఆడపనులూ, మగ పనులూ కూడా మీ నాన్నగా రెన్నాళ్లు చేస్తారు? పోయిన మీతల్లి తిరిగి రాదుకదా" అనిచెప్పారు. మంత్రులుచెప్పిన ప్రకారమే పిల్లలు తండ్రిని పెళ్లాడమని బతిమిలాడారు. కాని, రాజు ససేమిరా అన్నాడు.

ఇట్లా కాదని అప్పుడు మంత్రు లెంచేశారంటే, మనుష్యులను పంపించి మరుల మాతంగి ఆకులు తెప్పించి, వాటి పసరు సీకాయలో కలిపి తలంటుకోవడానికి పనివాళ్ళచేత ఇప్పించారు. దానితో తలంటుకోగానే రాజు "పెళ్ళో, పెళ్లో" అని కలవరించసాగాడు. వెంటనే మంత్రులను


పిలిచి "ఎక్కడన్నా ఒక చక్కని చిన్నది ఉంటే చూసి నాకు పెళ్లి చేసెయ్యండి" అని అడిగాడు.

మంత్రులు సంతోషించి, ముగ్గురూ పెళ్లికూతురికోసం ఊళ్లూ ఊళ్ళూ వెతక సాగారు. ఆఖరుకు వాళ్లు నయనవాది పట్నంఏలే ధవళరాజుకొలువుకు వచ్చారు. ఆ రాజుకు మాణిక్యాలదేవి అనే కుమార్తె ఉన్నది. ఆమెకు పెళ్ళి కావలసి ఉన్నది. ఆయన నవాభోజరాజుకు తన కూతురును యిస్తానన్నాడు. మంత్రులు సంబంధం స్థిరపరిచి ముహూర్తం పెట్టివేశారు.

నవాభోజరాజుకూ మాణిక్యాలదేవికీ పెళ్లి జరిగింది. కొత్తభార్యతోసహా రాజు చక్రపట్టణం తిరిగి వచ్చేటప్పుడు అన్నీ అపశకునాలే. వాళ్లు పెళ్ళి చేసుకు వస్తుండగా తీతువుపిట్ట కూసింది. దారిలో ఒక చెట్టుకొమ్మ విరిగి రాజుమీదపడే పర్యంతమైంది. ఆయన చచ్చిపోవలసిందే గాని అదృష్టవశాత్తు తప్పించుకున్నాడు.

అప్పుడు రాజు బ్రాహ్మలయిన తన మంత్రులను పిలిపించి. "మంత్రులారా, నాకు సంబంధం మీరే చూశారు. ముహూర్తం మీరే పెట్టారు. పెళ్లి చేశారు.





ఈ అపశకునాలకు అర్థం కూడా మీరే చెప్పండి" అని అడిగాడు.

మంత్రులు అన్నిటికీ అన్నిసమాధానాలు చెప్పి రాజుగారిని సమాధానపరచాలని ప్రయత్నించారు. కాని, రాజుగారికి తన కొత్తభార్యమీద మనసు విరిగిపోయింది. తన పట్నంచేరుకోగానే ఆమెను వేరే మేడలో ఉంచి తాను పిల్లలతో వెనకటిలాగా ఉండసాగాడు. మాణిక్యాలదేవికి మంగళ సూత్రం తప్ప మరొక నగలేకుండా చేశాడు. ఆమెకు తిండికి కూడా గుప్పెడు గింజ లిప్పించలేదు. మంత్రులు బతిమాలితే రోజుకు మూడుసోలల జొన్నలుమోయిన ఇవ్వమని చీటీ రాసి ఇచ్చాడు.

ఇంతలో ఒకనాడు నవాభోజరాజు జమాబందికి ఢిల్లీ పోవలసి వచ్చింది. పిల్లలను ఒంటిగా విడిచిపోవటం ఇష్టంలేక వారిని కూడా తన వెంట తీసుకుపోయే టందుకు యేర్పాట్లు చేయమని రాజు మంత్రులతో చెప్పాడు.

ఈ సంగతి తెలిసి మాణిక్యాలదేవి రహస్యంగా పిల్లలున్న మేడకు వచ్చి, "చూచారా అమ్మాయిలూ! మిమ్మల్ని మీ నాన్న ఢిల్లీ తీసుకుపోతారట. ఆయనతో

వెళ్ళితే మీకు, పాపం, అన్నం ఎవరు పెడతారు? నీళ్లెవరు పోస్తారు? తలలు దువ్వి పువ్వు లెవరు పెడతారు? అందుచేత మీరు వెళ్ళకండి. మీ నాన్నగారు రమ్మంటే రామనిచెప్పండి. 'మాపిన్నిదగ్గిరే ఉంటాం' అని అనండి" అని బోధించింది.

పిల్లలు తండ్రితో ఆ మాటే చెప్పారు. రాజు ఆశ్చర్యపోయినాడు. మారుతల్లిదగ్గిర ఉండడానికి వాళ్ల కభ్యంతరం లేకపోతే నాకుమటుకు దేని కనుకున్నాడు. వాళ్లను మాణిక్యాలదేవి దగ్గిర దిగవిడిచాడు. ఢిల్లీ నుంచి మంచి మంచి బట్టలూ, బొమ్మలూ, తినుబండారాలూ తెచ్చిపెట్టమని పిల్లలు అడిగారు. రాజు సరేనని వెళ్లిపోయినాడు.

మర్నాడు అమావాస్య. మాణిక్యాలదేవి సవితి పిల్లల్ని దగ్గిరికి పిలిచి ఈ విధంగా చెప్పింది:

"అమ్మలూ, ఇవాళ పౌర్ణమి. పగలల్లా పస్తుండి రాత్రికి చంద్రుణ్ణి చూసి భోం చేశారంటే మీకు పున్నమచంద్రులవంటి మొగుళ్ళు దొరుకుతారు" అన్నది.

పిల్లలు ముందు సరేనన్నారు సంతోషంగా. కాని వాళ్ళు రోజల్లా ఉపవాసం ఉండగలరా? అందరికీ ఆకలి దహించుకు



పోసాగింది. వాళ్లు ఆకలికి తాళలేక "పెళ్లిళ్ళు కాకపోతే పీడా పాయె. మా కింత అన్నంపెట్టు" అని మారుతల్లిని బతిమాలారు.

"ఉపోషం ఉంటామని ఎందుకన్నారే, దండుముండల్లారా! మీకోసం నేను అన్నం వండి వార్చి కూర్చున్నానా?" అని మాణిక్యాలదేవి అందర్నీ కసికొద్దీ మొట్టింది.

ఆ పిల్ల లెప్పుడూ మొట్టికాయలు తిన్న వాళ్ళు కారు. వాళ్లకి పట్టరాని దుఃఖం వచ్చేసింది. తండ్రితో ఎందుకు ఢిల్లీ వెళ్లాం కామా అని ఏడిచారు.



"వస్తున్నవాళ్ళు ఊరికే కూచోరాదు. మీరు తలా ఒక బిందె పట్టుకుని బావికి వెళ్లి నీళ్లు తోడుకురండి" అని మాణిక్యాలదేవి ఏడుగురికీ ఏడు చిల్లిబిందె లిచ్చింది.

పాపం, ఆ పసిపిల్లలు ఎన్నడూ ఏ పనీ చేసినవాళ్లు కాదు. వాళ్ళకి చేదవేసి నీళ్లు తోడటం చాతకాదు. బిందెలు మొయ్యటం అసలే చాతకాదు. కాని, చాతకాదంటే మాణిక్యాలదేవి ఒప్పదు. అఖరికి కాసిని మంచినీళ్లయినా ఇవ్వమని పిల్లలు బతిమాలారు. నీళ్ళు తెస్తేకాని దాహ మివ్వనన్నది మారుతల్లి.

ఇక విధిలేక బిందెలు చంకన పెట్టుకుని ఏడుగురూ బావికి బయలుదేరారు. దారిలో తమ తల్లిని తలుచుకునీ, కష్టాలు తలుచుకునీ పాపం ఏడువసాగారు. ఆ స్థితిలో వాళ్లను చూసి జాలిపడేటందు కెవరున్నారు? వాళ్ళను కన్నతల్లి లక్ష్మమ్మ తప్ప! ఆబిడ్డల వెంట ఎల్లప్పుడూ ఉంటున్న ఆ మహాతల్లి లక్ష్మమ్మ దారిలో అరటిచెట్లు కల్పించింది. ఆ చెట్లపళ్ళు అంది కోసుకుని ఏడుగురూ తిని కాస్త ఆకలి తీర్చుకున్నారు. నూతి దగ్గర నీళ్ళు తాగి దాహం తీర్చుకున్నారు. బావిలో బిందెలువేసి నీళ్ళు తోడుకుని బుజాల కెత్తుకుని తిరిగివచ్చారు. అవి చిల్లి బిందెలు కనక నీరంతా వారి ఒంటినిండా కారి బట్టలన్నీతడిశాయి. ఇంటికి చేరేవరకు బిందెలో గంటెడునీళ్ళుకూడా మిగలలేదు.

"పిన్నీ, పిన్నీ! ఇవన్నీ చిల్లిబిందె లేమిటి?" అని పిల్లలు అడిగారు.

"తప్పుడు ముండలారా! బిందెలు నూతికేసి కొట్టి చిల్లులుచేస్తారా?" అని మారుతల్లి మూరెడు కర్రతీసుకుని పిల్లల్ని బాదింది. పిల్లలు ఏడిచిఏడిచి అలిసిపోయి, "మమ్మల్ని దేనికి కొడతావు? నీకు మేమేమి అపచారం చేశాము? మాకు తిండి పెట్టకపోతే మానె, కాస్త దాహమన్నాయివ్వవా?" అనిఅడిగారు.


"ఇస్తాను ఉండండి" అని మాణిక్యాల దేవి లోపలికివెళ్ళి, ఏడు లోటాలలో కొంత జెముడు పాలూ, జిల్లేడుపాలూ పోసుకుని, అందులో నాభి, నల్లమందూ కలిపి తెచ్చి, పిల్లల కిచ్చింది. అవి నిజంగా పాలే అను కుని పిల్లలు గుటుకూ గుటుకూ తాగేశారు. అందరికీ గుండెలు బరువెక్కాయి. నాలుకలు పీక్కుపో సాగాయి. "అయ్యో, పళ్ళుతిప్పుతోంది. పాలు చేదు విషం" అని ఏడిచారు పిల్లలు.

"మీనాన్నకూ మీకూకూడా నేను విషం కాలేదా? చావండి" అంటూ మాణిక్యాల దేవి పిల్లల్ని కాలితో తన్ని పడమటింట్లోకి ఈడ్చి తలుపు గడియవేసేసింది.

కొనప్రాణంతో చావటానికి సిద్ధంగా ఉన్న పిల్లలకు ఆ లక్ష్మమ్మ కనిపించి, వాళ్లను చంపేస్తున్న విషం విరుగుడుచేసేసింది.

ప్రొద్దుకూకాక పిల్లలు చచ్చారో లేదో చూదామని మాణిక్యాలదేవి తలుపుతీసి చూసింది. అందరూ బతికేఉన్నారు. "పిన్నీ, చంద్రుడు పొడిచాడా" అని అడిగారు.

"పొడిస్తే నేను తెలుతానులే. మీరు పడుకోండి" అని మాణిక్యాలదేవి మళ్లీ తలుపుమూసి వెళ్లిపోయింది. ఇంత విషం



తినికూడా పిల్లలు చావకపోవటం ఆవిడకు ఆశ్చర్యం వేసింది.

మర్నాడు తెల్లవారుతోంది. పిల్లలు లేచి, "పిన్నీ! పున్నమచంద్రుడేడీ ?" అని అడిగారు. "పున్నమచంద్రుడు పొడవనూ పొడిచాడు, కుంకనూ కుంకాడు" అన్నది మాణిక్యాలదేవి. "అట్లా అయితే మాకు అన్నం పెట్టు" అన్నారు పిల్లలు.

"ఇంతా ఉండి పూర్ణచంద్రుణ్ణి చూడకుండా భోంచేస్తారా? రాత్రిదాకా ఉపోషం ఉండండి. లేకపోతే మీకు ముసలి మొగుళ్లు దొరుకుతారు" అన్నది మారుతల్లి.

పిల్లలు అకలికి అగలేమంటే అగలేమన్నారు. "అట్లా గయితే స్నానాలు చేసి నీళ్ళు తెచ్చుకోండి, భోంచేద్దురుగాని" అన్నది మాణిక్యాలదేవి. "ఇంకా చీకటిగా ఉంది. మేము పోలే"మన్నారు వాళ్లు.


"మిమ్మల్నేమన్నా దయ్యం యెత్తుకుపోతుందా? అంత భయమైతే నేను వెంట వస్తాను పదండి" అని మాణిక్యాలదేవి ఏడుగురినీ వెంటబెట్టుకుని ఊరికి దక్షిణాన అడవిలో ఉన్న పాడుపడిన గుడిదగ్గిరికి తీసుకుపోయింది.

"మీరంతా లోపలికి వెళ్లి, మంచి మొగుళ్ళు దొరకాలని దేముడికి దణ్ణం పెట్టుకురండి" అని పిల్లలను లోపలికి పంపించి, తలుపుమూసి తాళంవేసి, పాపిష్టి మాణిక్యాలదేవి యింటికి తిరిగి పోయింది.

ఆ బిడ్డలు ఆవిధంగా తొమ్మిది రోజుల పాటు అన్నం, నీళ్ళూ లేకుండా ఆ పాడుబడిన గుడిలో అల్లాడి పోయినారు. వాళ్ల అరణ్యరోదన ఎవరు వింటారు? వెరుగులల్లే అయిపోయిన వాళ్ల దేహాలుచూసి ఎవరు జాలిపడతారు? ఆమహాతల్లి లక్ష్మమ్మతప్ప!

కన్నబిడ్డలు కటకటలాడిపోతుంటే భరించలేక లక్ష్మమ్మ గుడినిండా తేనెపట్టులు చేసింది. కొనప్రాణంతో ఉన్న పసిపాపల నోళ్ళలోకి తేనెధారలు కురవసాగాయి. ఆ తేనెధారలతో వాళ్లప్రాణాలు కాస్త తెప్పరిల్లుకున్నాయి. [ఇంకా ఉంది]






అక్కడ ఢిల్లీలో, తన విడిదిలో, నవాభోజ రాజు సుఖనిద్రలో ఉన్నాడు. ఆయనకు వీపుమీద ఎవరో చరిచినట్లైంది: "లేవయ్యా, లే! నీ బిడ్డల్ని అడివిపాలుచేసి ఇక్కడ హాయిగా నిద్రపోతున్నావా?" అనే మాటలు ఆయన చెవులలో గింగురుమన్నాయి.

రాజు ఉలిక్కిపడి లేచాడు. ఎన్నడూ కనిపించని లక్ష్మమ్మ కలలో కనిపించింది, బిడ్డలకేదో అయిందనుకున్నాడు. జమా బందిపని మంత్రులకు వదిలి, త్వరగా పిల్లలందరికీ బట్టలూ, నగలూ, తినుబండారాలూ, బొమ్మలూ కొనుక్కుని ఢిల్లీరాజుకు కబురైనా చెయ్యకుండా నవాభోజరాజు ఇంటికి వచ్చేశాడు. ఢంకామోతవిని పిల్లలు ఎదురురాకపోయేసరికి ఆయనకు ఆరాటం మరింత హెచ్చింది. మాణిక్యాలదేవి ఇంటికి వెళ్లాడు. ఆవిడ ఇంట్లో ఒంటరిగానే వుంది.

"పిల్ల లేరీ?" అని అడిగాడు రాజు.

"పిల్ల లేరీ అని అడుగుతున్నారా? మీ మొదటిభార్యగారు వచ్చి, ఇంట్లో కుండలన్నీ పగులగొట్టి, నా శరీరమంతా రక్కి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది" అన్నది మాణిక్యాలదేవి. లక్ష్మమ్మకు మాట ఇచ్చి కూడా తాను తిరిగి పెళ్లాడినందుకు కోపం వచ్చి ఆమె పిల్లల్ని తీసుకుపోయింది కాబోలు అనుకున్నాడు రాజు.

వాళ్ళకోసం దేశమంతటా వెతికించాడు. దొరకలేదు. చివరకు తానే పల్లకీఎక్కి వెతకటానికి బయలుదేరాడు.

అట్లా వెతుకుతూ అడవిని పడిపోగా ఒకచోట అడుగులజాడలు కనిపించాయి. ఏడు జతలు చిన్నపాదాల గుర్తులూ, ఒక జత పెద్దపాదాల గుర్తులూ అగుపించాయి. ఆ ఏడుగురూ తన పిల్లలనీ, ఎనిమిదో మనిషి లక్ష్మమ్మ అనీ, మాణిక్యాలదేవి నిజమే చెప్పిందనీ, ఈ గుర్తులవెంట పోతే



పిల్లలు దొరుకుతారనీ రాజుకు తోచింది. ఆ గుర్తులు పాడుపడిన దేవాలయం దాకా వచ్చి ఆగిపోయాయి. దేవాలయానికి తాళాలువేసి ఉన్నాయి. ఈగుడికి తాళాలు ఎవరు వేస్తారా అని సందేహం తోచి రాజు తాళాలు పగులగొట్టించి లోపల ప్రవేశించే సరికి కొనప్రాణాలతో తన యేడుగురు బిడ్డలూ కనిపించారు. వాళ్లను పల్లకీలో యెక్కించుకుని రాజు యింటికి తిరిగి వచ్చాడు. మారుతల్లి తమకుచేసిన దుర్మార్గమంతా పిల్లలు తండ్రికిచెప్పేశారు. రాజుకు మాణిక్యాలదేవిమీదకోపంవచ్చి, ఆమె ఇంటి ముఖం చూడక, తన పిల్లలకు అన్నీ తానే చేసుకుంటూ యెప్పటిమాదిరిగా ఉన్నాడు.

రాజుని ఎట్లాగయినా తనవలలో వేసుకొన వలెనని మాణిక్యాలదేవి అడవిలో ఏవో ఆకులు తెప్పించి, పసర్లు పిండించి, రాజు స్నానంచెయ్యటానికి వెళ్లివున్న సమయంలో, ఆయన వంటలో ఈ పసర్లు కలిపించింది. రాజుగారు భోజనంచేసి పడుకోగానే మాణిక్యాలదేవిమీద వెర్రిమోహం పుట్టుకొచ్చి నిలువలేక పోయినాడు. పిల్లలు నిద్రపోతున్నారు. రాజు మాణిక్యాలదేవి మేడకు వెళ్లి తలుపుతట్టాడు. మాణిక్యాలదేవి తలుపు తియ్యక, " నీ పిల్లలుండగా నీకు నేనెందుకు? వాళ్లను చూసుకునేగదా నన్ను వొదిలేశావు. వాళ్ళందరి గొంతులూ కోసిరా, అప్పుడు తలుపుతీస్తాను" అన్నది.

" అయ్యో! ఎవరయినా కన్నబిడ్డల గొంతులు కోసుకుంటారా?" అన్నాడురాజు.

"ఐతే వాళ్లను నట్టడవిలో విడిచేసిరా. నీకు వాళ్లన్నా ఉండాలి, నేనన్నా ఉండాలి" అన్నది మాణిక్యాలదేవి. ఆమె మీద కొత్తగా పుట్టిన మోహంలో, రాజు తన బిడ్డలను అడివిపాలుచెయ్యటానికి సిద్ధపడ్డాడు. ఇంటికి వెళ్లి పిల్లలను లేపి, "అమ్మా!

లెండే, మనం మీ మేనమామల యింటికి పానుగంటి పట్నానికి పోదాం" అన్నాడు.

"మనకు మేనమామ లెవరున్నారు? ఎప్పుడూ వినలేదే!" అన్నారు పిల్లలు.

"పదేళ్లుగా వాళ్లకీ మనకీ మాటలులేవు. మీ అమ్మపోయింది కనక మనం ఒకసారి వెళ్లి వాళ్ళను చూసొస్తే బాగుంటుంది" అన్నాడు రాజు. పిల్లలు సరే నన్నారు.

రాజు పిల్లల్ని అడవిలో విడిచిపెడుతున్నాడని తెలిసి, సంతోషంతో మాణిక్యాలదేవి పిల్లలు ఏడుగురికీ విషంపెట్టిన ఏడు రొట్టెలు తయారుచేసింది. రాజుకు వేరే అన్నంమూట కట్టింది. పిల్లల రొట్టెలను రాజును తినవద్దన్నది. తింటే తనకు రొట్టె తక్కువైందని యెవరో ఒకరు నిష్ఠూరణంగా ఏడుస్తారు. తన భోజనం పిల్లలకు పెట్టవద్దన్నది. ఒకరికి పెడితే అందరికీ పెట్టాలి; రాజుకు చాలదు. ఈ మాయ మాటలు నమ్మి, రాజు సరేనన్నాడు. తండ్రి ముందూ, పిల్లలు వెనకా బయలుదేరారు.

ఊరుదాటారు. బాలనాగమ్మ దారిలో ఒక కాకినిచూసి సరదాకు తన ఒళ్లోవున్న రొట్టె కొంచెం తుంచి వేసింది. అముక్క తిని, కాకి అక్కడే గిల, గిల తన్నుకు చచ్చింది.





బాలనాగమ్మ ఆశ్చర్యపడి మరో ముక్క తుంచి కుక్కకు వేసింది. అది తిని కుక్క కూడా చచ్చింది.

"అయ్యో, ఈ రొట్టెల్లో విషం ఉంది. ఇవి తింటే మనం చస్తాం. ఎక్కడన్నా పారేస్తే యితరజంతువులు తిని చస్తాయి. ఆ పాపం మనకు చుట్టుకుంటుంది. అందుకని అందరి రొట్టెలూ, గొయ్యి తీసి, గోతిలో పూడ్చేద్దాం" అన్నది బాలనాగమ్మ.

ఏడుగురు పిల్లలూ తమ తమ రొట్టెలు మట్టిలో పూడ్చి యిసుక కప్పి దిమ్మస చేసి ముందుకు సాగారు.

మరి కొంతసేపటికి వాళ్ళు అడవిలో ప్రవేశించారు.

కొంతదూరం పోగా పోగా బాలనాగమ్మకు ఆకలి వేసి నడవలేకపోయింది. ఆసంగతి తన అక్క సూర్యనాగమ్మతో చెప్పింది. ముందు పోతున్న తండ్రిని కలుసుకుని సూర్యనాగమ్మ, "నాన్నా, చెల్లెలు బాలనాగమ్మ ఆకలికి నడవలేకుండా ఉంది. నీ మూటలో అన్నంకొంచెం పెట్టు, పాపం" అన్నది.

"ఈ మూటలోది అన్నం కాదమ్మా. దారిలో ఎలుగుబంట్లు వస్తే తరమటానికి మూడు ఇటుక రాళ్లు కట్టుకున్నాను. పానుగంటికి వచ్చేశాంలే. కొంచెం ఓపిక పట్టి నడవమని చెప్పు" అన్నాడు నవాభోజరాజు.

కాని బాలనాగమ్మ కూర్చుని లేవలేక పోయింది. తండ్రికి కోపంవచ్చి దగ్గిర వున్న చెట్టుకొమ్మ విరిచి బాలనాగమ్మను రెండు కొట్టాడు.

"దాన్ని యెందుకు కొడతావు, నాన్నా! బాలనాగమ్మ నడవలేకపోతే మేము ఎత్తుకొస్తాం లే" అని మిగిలిన ఆరుగురూ ఆమెను మోసుకు నడవసాగారు.



ఇంతలో పొద్దుకూకింది.

"అర్ధరాత్రివేళ పోతే మనల్ని ఎవరూ గుర్తుపట్టరు. అంతా నిద్రపోతూ ఉంటారు. అందుకని ఈ రాత్రి అడవిలోనే పడుకుని తెల్లవారి మీ మేనమామల ఇంటికిపోదాం" అన్నాడు రాజు. అందరూ పడుకున్నారు. తండ్రిని మధ్యలోపెట్టుకుని పిల్లలు అటూ ఇటూ పడుకున్నారు. ఆకలితో అర్ధరాత్రి దాకా యెవరికీ నిద్రపట్టలేదు.

పిల్లలంతా నిద్రపోగానే రాజు లేచి తన స్థానంలో ఒక బూరుగదుంగను పెట్టి, దానికి తన తలపాగా చుట్టి, మీద ఒక గుడ్డ కప్పి, తిరిగి తన పట్టణానికి బయలు దేరాడు. కొంతదూరం వచ్చాక తూర్పు తెల్లవారసాగింది. ఒకచెరువుదగ్గిర మొహం కడుక్కుని తాను తెచ్చుకున్న అన్నం తినటానికి మూటవిప్పిచూసేసరికి అందులో మూడు ఇటుకరాళ్లే ఉన్నాయి.

"ఎంత పాపకర్ముణ్ణి! పిల్లలకయినా పెట్టకపోతినే!" అనుకుంటూ రాజు ఇంటికి తిరిగిపోయి, పిల్లలను మరచి మాణిక్యాల దేవితో సుఖాలలో ఓలలాడ సాగాడు.

ఇక్కడపిల్లలు తెల్లవారుతూనే లేచారు. తండ్రినిపిలిచారు. పలకలేదు. తట్టిలేపారు.



తండ్రికిబదులు బూరుగ దుంగఉండటం చూశారు. తమతండ్రి చచ్చి దుంగ అయి పోయినా డనుకుని ఏడిచారు. తరువాత ఆ దుంగను పట్టుకెళ్లి దహనంచేసి ఒక చెరువులో అందరూ స్నానాలు చేశారు. అందరికీ ఆకళ్ళు మండిపోతున్నాయి. ఎటుచూసినా అరణ్యం. పాపం! వాళ్ళకి దారి తెలియదు.

ఈ సమయానికే పానుగంటి రామవద్ది రాజు ఆ అడవికి వేటకు వచ్చాడు. ఆయన పరివారానికి ఈ యేడుగురు పిల్లలూ దొరికారు. "అయ్యో! పాపం, ఎవరో పసివాళ్లు, ఏడుగురు ఆడపిల్లలు ఆకలికి తపించుకు పోతూ ఇక్కడ వున్నా"రని భటులుచెప్పగా వేటకు వచ్చిన రాజు వారిని చూచి వారి కథంతా విన్నాడు. వాళ్ళు తన చెల్లెలయిన లక్ష్మమ్మ పిల్లలే నని ఆయనకు వాళ్ల మాటలనుబట్టి తెలిసింది.

రామవద్దిరాజుకు ఏడుగురు కొడుకులు. రామవద్దిరాజు మేనకోడళ్లను తన వెంట పానుగంటి పట్నానికి తీసుకుపోయి వారిని తన ఏడుగురు కొడుకులకూ యిచ్చి మహా వైభవముగా పెళ్ళి చేసుకున్నాడు. అందరి లోనూ ఆఖరువాడైన కార్యవద్దిరాజుకు బాలనాగమ్మ నిచ్చారు.

* * *

ఈసమయానికే నవాభోజరాజుకు చెడ్డ రోజులు వచ్చాయి. జమాబందికి వచ్చిన వాడు తనను చూడకుండా, కిస్తీ చెల్లించ కుండా తిరిగి వెళ్లిపోయినా డని ఢిల్లీ పాదుషాకు కోపం వచ్చింది. సైన్యాలను పంపి నవాభోజరాజు ఆస్తి జప్తు చేయించాడు. ఆయనను ప్రభుత్వంనుంచి తీసివేశాడు.

మాణిక్యాలదేవితోపాటు నవాభోజ రాజుకూ ఇల్లూవాకిలీ లేకుండాపోయింది. కొంతకాలంపాటు వారూ వీరూ తెండి



పెట్టారు. నవాభోజరాజు పాదుషాకు ఎన్నో అర్జీలు పంపాడుగాని, పాదుషా వాటికేసి చూడలేదు.

"మనరోజులు బాగాలేవు. ఏలిన ఊళ్లో కూలి చేసుకోలేము. ఎక్కడికయినా వెళ్లిపోదాం" అన్నాడు నవాభోజరాజు భార్యతో.

ఇద్దరూ అడివినిపడి పానుగంటి చేరారు. అడవిలో కట్టెలేరుకుని పానుగంటిపట్నం వీధుల్లో అమ్ముకుని, సాయంకాలానికి ఒక మర్రిచెట్టు దగ్గిర కలుసుకుందామని యేర్పాటుచేసుకున్నారు.

రాజు ఒక వీధివెంట సాగాడు. మాణిక్యాలదేవి మరోవీధిన పడింది. తమ ఇంటి ముందుగా " కట్టెలు, కట్టెలు " అంటూ రాజు వెళుతుంటే పిల్లలు తండ్రిగొంతువిని ఆశ్చర్యపడ్డారు. పిలిపించి నువ్వెవరని అడిగారు. తమతండ్రే అని తెలిసి ఆయనచేసిన మోసం అప్పుడు గ్రహించారు. కాని ఆయన కష్టంలో ఉండటంచూసి జాలిపడి లోపలికి పిలిచి భోజనంపెట్టి గౌరవించారు.

సాయంకాలం కాగానే మాణిక్యాలదేవి మర్రిచెట్టు క్రిందికి వచ్చి భర్తకోసం చాలాసేపు చూచింది. ఎంతకూ ఆయన రాలేదు. "ఈ మగవాళ్ళను నమ్మరాదు. తాను సంపాదించిన సోలెడుగింజల్లో నాకు పెట్టవలసివస్తుందని మొహంతప్పించాడు" అనుకొని మాణిక్యాలదేవి ఊరికి ఉత్తరంగా పడి ఎక్కడికో వెళ్లిపోయింది.

* * *

కాని రాజు ఎంతోకాలం బ్రతకలేదు. మరి మాణిక్యాలదేవి పెట్టిన మందులు ఊరికే పోతాయా? ఆయన ఆరోగ్యం పూర్తిగాచెడింది. ఆయనశరీరం ఉబ్బింది. కదలలేదు. మంచానకూడా పడ్డాడు. ఎన్ని చికిత్సలు చేసినా లాభం లేకపోయింది. ఆఖరుకు ఆయన తన కూతుళ్ళ చేతుల

మీదుగానే చనిపోయాడు. ఆయనకు దహన సంస్కారం, ఉత్తరక్రియలు చక్కగ జరిగాయి.

* * *


కొన్ని సంవత్సరాలు గడిచినవి. బాలనాగమ్మా, ఆమె ఆరుగురు అక్కలూ భర్తలతో సంసారంచేస్తూ హాయిగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. బాలనాగమ్మ అక్కలకు ఇంకా సంతానం కలగలేదు. కాని, బాలనాగమ్మకు గర్భచిహ్నాలు కనిపించినవి. ఈవార్త ఆమె అక్కలకే కాదు, బావలకూ, భర్త కార్యవర్థిరాజుకూ ఆనందం కలిగించింది. పానుగంటి పట్టణం చక్కగా అలంకరించి ఉత్సవాలు చేశారు. బీదలకు అన్నదానం చేశారు.

* * *

ఇంతలో సూర్యవర్థిరాజూ, అతని ఆరుగురు తమ్ములూ ఏదో అవసరమైన పనిమీద గండికోట వెళ్లవలసి వచ్చింది. ఏడుగురూ ముస్తాబయినారు. పల్లకీలు వచ్చి వాకిట సిద్ధంగా ఉన్నాయి. వాళ్లు తలారిరాముణ్ణి పిలిపించి, "ఒరే, ఎవరైనా జోగులూ, జంగాలూ, బ్రాహ్మలూ, పరదేశీయులూ యాచనకువస్తే బియ్యమూ, పప్పూ యిప్పించి పంపు. కాని యెవరినీ కోటలో అడుగుపెట్ట నివ్వకు. ఎవరయినా లోపల అడుగుపెడితే నీ బుర్ర తీయిస్తాం, జాగర్త!" అని చెప్పారు.

బాలనాగమ్మ పెనిమిటిఅయిన కార్యవర్థిరాజు, గర్భిణిగా ఉన్న తన భార్యతో, "మన తలవాకిట ఏడు గిరులు గీశాను. నేను తిరిగి వచ్చేవరకూ నువు పొరపాటున కూడా ఈ ఏడు గిరులూ దాటి వెళ్ళవద్దు" అని చెప్పాడు.

ఆ తరవాత ఏడుగురు అన్నదమ్ములూ పన్నెండువేల పరివారంతో గండికోటకు ప్రయాణమై పోయినారు. [ఇంకా వుంది]





# బాలనాగమ్మ

పానుగంటి రాజులు ఏలే రాజ్యంలో నాగళ్లపూడి గట్టున్నది. అక్కడ మాయల ఫకీరున్నాడు. వాడికి ఒక బ్రహ్మాండమైన కోట వున్నది. కోటలోపల ఏడు వెండి మేడలూ, పద్దానుగు బంగారు మేడలూ ఉన్నాయి. అన్నిటికీ నట్టనడమ పన్నెండు స్తంభాల మసీదున్నది. ఈ మసీదులో కూచుని మాయలఫకీరు అరవమూ, ఖురానూ చదువుతాడు. వాడు చాలా గొప్ప మంత్రగాడు. వాడి చుట్టూ ఎప్పుడూ భూతా లుంటాయి. ఏడువందల ఎర్ర భూతాలూ, మూడువందల ముక్కిడి భూతాలూ వాడు చిటికెవేస్తే పలుకుతాయి.

మాయలఫకీరు చిటికెవేశాడు. చాకలి దయ్యం దివిటీ పట్టింది. మంగలి దయ్యం అద్దంచూపింది. కుమ్మరిదయ్యం కూడు వండింది. గొల్లదయ్యం మేకలు తెచ్చింది. వెట్టిదయ్యం కట్టెలు తెచ్చింది. లంబాడీ దయ్యం కాళ్లు పట్టింది. ముసలి దయ్యం ముచ్చట్లు చెప్పింది.

తూర్పునుంచి ఒక పకీ, పడమటి నుంచి మరొకపకీ వచ్చి నాగళ్లపూడి గట్టుమీది గంగరేగు చెట్టుమీద జంటగా కూర్చున్నాయి. మాయలఫకీరు తన ఉంపుడుకత్తెఅయిన గాండ్లసంగునుపిలిచి, "ఒసే, సంగూ! ఆ పకులు చూడవే. నాకు అటువంటి జోడులేదే!" అన్నాడు. గాండ్ల సంగు ముసలిదయి పోయింది, మరి ఒక పడుచు అందగత్తెను తెచ్చి దానితో సుఖంగా ఉంటూ, దానికీ, సంగుకూ లడాయిపెట్టి వినోదం చూడాలని పుట్టింది ఫకీరుకు. వాడు ఒక నల్లపిల్లిని చంపి భస్మంచేసి యెడమకంటికి అంజనంవేసి అందులో నాల్గుగు దిక్కులూ కలయ

చూశాడు. పడమటిదిక్కుగా పన్నెండామడ దూరాన పానుగంటి పట్టణంలో ఉన్న బాలనాగమ్మ మాయలఫకీరు కంటపడింది. ఆమెను చెరపట్టుకురావటానికి తీర్మానించు కున్నాడు. నాగళ్లపూడి గట్టుకింద మౌలాలీ పేటలో ఉన్న గాండ్లసంగుఇంటికి వెళ్లాడు.

గాండ్లసంగు ఫకీరుకు పట్టెమంచం, వేసింది. రెండుపుట్ల గోధుమ రొట్టెలూ, పంధుం పెసరపప్పూ వండిపెట్టింది. ఫకీరు అదంతా తిని, మూడుతూముల మానె తాగి, అరవైలోటాల కల్లు తాగాడు. కైపెక్కలేదు. తాటికాయంత నల్లమందు మింగాడు, నిషా రాలేదు. బంగి తాగాడు, మత్తే కలగలేదు. మూడుపుట్ల గంజాయి బంగారపు హుక్కాలో వేసి చిలుము పట్ట సాగాడు. ఫకీరు హుక్కా తాగుతుంటే ఏడు పల్లెలూ ఒక్కసారి మండినట్టుంది. అప్పుడు ఫకీరుకు ఉషారు పుట్టుకొచ్చింది. బాల నాగమ్మను తీసుకురావాలనే తహ తహ జాస్తిఅయింది. లేచి చక్కగా వేషం వేసు కుని అద్దంలో చూసుకొన్నాడు. ఈవేషంతో బాలనాగమ్మను తీసుకురాలే నను కున్నాడు. బుడ్డిచెంబు పట్టి, పంచాంగం చంకనపెట్టి, నడుముకు అంగవస్త్రంచుట్టి



బ్రాహ్మణవేషం వేశాడు. అదీ బాగా కనిపించలేదు. త్రాసు పట్టుకుని కోమటివేషం వేశాడు. అదీ బాగా లేదు. చివరకు నెత్తిన రుద్రాక్షి కిరీటం, నడుముకి బంగారు సల్లా, చంకన విభూతికొలెలా పెట్టుకుని బాలవయస్సుగల జంగందేవర వేషంవేశాడు. శంఖూ, గంటా చేత పట్టాడు. వెండిబెత్తమూ, బంగారు బెత్తమూ జోలీలోవేసి పానుగంటికి బయలుదేరాడు.

జంగంవేషంలో ఉన్న మాయలఫకీరును తలారిరాముడు కోట బయట నిలవేసి లోపలికి పోవడానికి అజ్ఞలేదన్నాడు. బిచ్చంకావలిస్తే తానే వేస్తానన్నాడు. మాయలఫకీరు యెన్ని చెప్పినా తలారిరాముడు వినలేదు.

ఫకీరుకు కోపంవచ్చి, "ఓరీ నీ కిందుకనే పిల్లలు కలగలేదు. నేను చూడు, ఏడురోజుల కిందట బాల నాగమ్మకు బాలుణ్ణి యిచ్చాను" అన్నాడు. ఈ మాట వినగానే ఆ మాయ జంగాన్ని చూసి






తలారి రాముడు సాక్షాత్తుగా శివుడే అనుకున్నాడు. మాయలఫకీరు కాళ్ళమీద పడి తనకు పిల్లల్ని ఇవ్వమని బతిమలాడాడు. మాయలఫకీరు చిటికెడు విభూతి జోలెలో నుంచి తీసి తలారిరాముడి నొసట పెట్టి, గుప్పెడు విభూతి చేతికిచ్చి, "ఈ విభూతి తీసుకుపోయి నీభార్యలనోట్లో కొంతవెయ్యి, నెత్తిన కొంత చల్లు. నీ ఇంటిమీదా, కప్పుమీదా, గాదెల్లోనూ, గంపల్లోనూ, బావుల్లోనూ, దొడ్డిలోనూ చల్లు" అని చెప్పాడు.

తలారి రాముడు ఒక్క పరుగున ఇంటికి వెళ్లాడు. మాయలఫకీరు చెప్పినట్టే విభూతి భార్యల నెత్తినా, నోళ్లలోనూ, ఇంటోనూ, కప్పుమీదా, దొడ్లోనూ, బావిలోనూ వేసేశాడు. విభూతి పడిన చోటల్లా పిల్లలు పుట్టుకొచ్చారు. తలారిరాముడి నెత్తినుంచీ, వాడిభార్యల నెత్తినుంచీ పిల్లలు దూకసాగారు. ఇల్లంతా పిల్లలే. గంపల్లోనూ, గాదెల్లోనూ పిల్లలే. ఇంటికప్పుమీద పిల్లలు. దొడ్డినిండా పిల్లలు. లుక లుక లాడుతూ బావినిండా పిల్లలే. మూడు నాలుగువందల పిల్లలు ఒకేసారి, "అమ్మా, అన్నమే! నాన్నా, అన్నమే!" అని ఒకటే గోల చేస్తున్నారు. ఎంతతిన్నా వాళ్ళ ఆకలి తీరదు. ఇల్లంతా ఊడ్చిపెట్టేశాడు తలారి రాముడు. వాడికి గాభరా యెత్తింది. ఒక్క పరుగున వచ్చి జంగం కాళ్ళమీదపడి, "బాబూ, నాయనా! నాకు పిల్లలూ వద్దు, పిడుగులూ వద్దు! ఈ పిల్లల్ని లేకుండా చేస్తివా, నిన్ను కోటలోకి పోనిస్తాను" అన్నాడు.

మాయలఫకీరు మళ్లా తలారిరాముడి నొసట విభూతిపెట్టి, "పో, నీకు కావలసినంతమంది పిల్లలే ఉంటారు!" అన్నాడు. తలారి రాముడు ఇంటికి వెళ్లి చూసుకునేసరికి, జంగం దేవర ధర్మాన, ఏడుగురు పిల్లలే ఉన్నారు. తలారి రాముడి ప్రాణం





కుదటబడింది. వాడు తిరిగివచ్చి మాయల ఫకీరును కోటలోపలికి పోనిచ్చాడు.

మాయలఫకీరు కోటలో ప్రవేశించాడు. బాలనాగమ్మ ఏడురోజుల బాలింతరాలు. ఆమె అక్కలు ఆరుగురూ వెండి బిందెలు పట్టుకొని బావికిపోతూ కనిపించారు. ఫకీరు వాళ్ళ బిందెలనిండా వరహాలు చేశాడు. వాళ్లు ఆశ్చర్యపడి యింటికిపోయి చూసు కుంటే బిందెలనిండా చిల్లిపెంకు లున్నాయి. మాయలఫకీరు సూర్యనాగమ్మ ఇంటికి పోయి, "గారడివానికి, కట్టుమోతు వానికి, బాలింతరాలికి, పసిబిడ్డ తల్లికి మా బసవన్న విభూతి పెట్టితే, భూతప్రేత పిశాచములు పారిపోతవి, బ్రహ్మరాక్షసు లణగిపోను. శాంభమూర్తి కరుణా కటాక్షం కలిగి, గురుకటాక్షం కలిగి వర్ధిల్లవలె" అని అరిచాడు.

ఈవిధంగా బాలనాగమ్మ అక్కలు ఆరుగురి మేడలకీ వెళ్లి భిక్షం అడిగాడు. ఆఖరుకు బాలనాగమ్మ మేడకు వచ్చాడు. భం. భం అని శంఖం పట్టాడు. దాసీలు బిచ్చం వెయ్యబోతే తిప్పికొట్టి, ఇంటి యజమానురాలిని వచ్చి బిచ్చం వెయ్యమన్నాడు. బాలనాగమ్మ పురిటి బాలింతరాలని దాసీలు చెప్పారు. బాల నాగమ్మ బయటికి వచ్చి బిచ్చం వెయ్యక పోతే తా నిచ్చిన సంతానం తిరిగి తీసుకు పోతానని బెదరించాడు. దాసీలు భయపడి వెళ్లి బాలనాగమ్మకు చెప్పారు. తన బిడ్డను ఎక్కడ చంపిపోతాడో అని బాలనాగమ్మ పురిటి మంచం మీదినుంచి లేచి జంగం దేవరకు బిచ్చం పెట్టటానికి సిద్ధపడింది. కాని, మంచంలో పిల్లవాడు ఏడవసాగాడు. వాడు ఏడుపు మానుతాడని తన వేలి ఉంగరంతీసి వాడి వేలికి పెట్టింది. బిచ్చం పట్టుకుని బయటికి వచ్చింది.



బాలనాగమ్మ ఏడుగిరులు దాటివస్తేగాని మాయలఫకీరు బిచ్చం పట్టనన్నాడు. గిరులు దాటిరావటానికి బాలనాగమ్మ భయపడింది. పిల్లవాణ్ణి చంపేస్తానని ఫకీరు భయపెట్టాడు. బాలనాగమ్మ ఫకీరు మాటలకు జడిసి బయటికి వచ్చింది. బిచ్చం జోలెలో వేసుకుంటూ ఫకీరు ఆమెను రాగిబెత్తంతో తాకాడు. వెంటనే బాలనాగమ్మ కుక్కగా మారిపోయింది. కుక్క లోపలికి పరుగెత్తి "బొంయి,బొంయి"మని అరుస్తూ పిల్లవాడి మంచం చుట్టూ తిరిగింది. ఫకీరు కుక్కను బయటికి రమ్మని అదలించాడు. కుక్క బయటికి వచ్చేసింది. దానిమెడకు తోలుపట్కా తగిలించి మాయలఫకీరు వెంటబెట్టుకొని కోటబయటికి వచ్చాడు.

కోటవాకిట తలారిరాముడున్నాడు. వాడు జంగందేవర వెంట ఉన్న కుక్కను చూసి, "ఇది నీ వెంట లోపలికి పోలేదే, దీన్ని నేను బయటికి పోనివ్వను"అన్నాడు. ఫకీరు మంచిగా చెప్పాడు. బెదిరించాడు. కుక్క బయటికి పోవటానికి మటుకు తలారి రాముడు ఒప్పలేదు. ఫకీరు తన జోలెలో నుంచి ఇంత విభూది తీసి తలారిరాముడిపై చల్లాడు. వాడికి శివం ఎత్తింది. పిచ్చివాడల్లే తలారిరాముడు పొలాలవెంటా, అడవులవెంటా పరిగెత్తసాగాడు.

మూడోనాటికి మాయలఫకీరు నాగళ్ళపూడి గట్టుకింద మౌలాలీపేట దగ్గిర ఒక మర్రిచెట్టు చేరుకున్నాడు. వెంట వస్తున్న కుక్కను బంగారు బెత్తంతో తాకాడు. గల్లు గల్లున గాజుల చప్పుడైంది. అందెల మువ్వల చప్పుడైంది. తళుక్కున మెరిసి బాలనాగమ్మ ప్రత్యక్షమయింది. మోహం పట్టలేక మాయలఫకీరు "కోమలాంగీ, నా కోరిక దీర్చవే. ఒక్క ముద్దు పెట్టవే," అని తహతహ లాడసాగాడు.

"ఓరీ మాయలఫకీరా, నేను పన్నెండేళ్ల వ్రతం పట్టాను. ఆవ్రతం పూర్తిఅయేదాకా నీ కోరిక చెల్లించలేను. ఆ తరవాత నే నెక్కడికి పోతాను? ఈ లోపల నన్ను ముట్టుకుంటివా తలపగిలి చచ్చిపోతావు, జాగ్రత్త" అన్నది బాలనాగమ్మ.

ఇన్ని మాయలు నేర్చిన మాయల ఫకీరుకు వశీకరణ మంత్రాలూ, ఆకు పసరులూ తెలియవు. బాలనాగమ్మ మాట లకు వాడు భయపడి గడగడ వణికి పోయాడు.


బాలనాగమ్మను వెండిబెత్తంతో తట్టి ఇంత బూడిదచేసేసి ఆ బూడిదను జోలెలో వేసు కుని గాండ్లసంగు మసీదుకు వెళ్లాడు. బాలనాగమ్మను తీసుకురావటం సాధ్యం కాక మాయలఫకీరు ఒంటరిగా తిరిగివచ్చా డనుకుని గాండ్లసంగు వాణ్ణి యెగతాళి చేసింది.


మాయలఫకీరు జోలెలో బూడిద పైకి తీసి బంగారు బెత్తంతో తట్టాడు. గల్లు గల్లున గాజులూ, అందెల మువ్వలూ మోగుతూ, తళుక్కున బాలనాగమ్మ ప్రత్యక్షమయింది. మసీదంతా ఒక్కసారి వెలిగిపోయింది.

"అయ్యో, తల్లీ! పీడిపాల నేను పడనే పడ్డాను. నువుకూడా యెందు కొచ్చావు?" అని అడిగింది గాండ్లసంగు బాలనాగమ్మను. బాలనాగమ్మ ఘోరున ఏడ్చింది.

బాలనాగమ్మను మసీదులోనే ఉంచి, మాయలఫకీరు పన్నెండేండ్ల వ్రతం ఎప్పటి కవుతుందా అని యెదురు చూడసాగాడు.

మసీదులో బంధింపబడిన బాలనాగమ్మ తన పసిపాపకు కలిగిన అవస్థ తలుచు కొని దుఃఖించసాగింది. దుర్మార్గుడయిన మాయలఫకీరు తనను ఖైదుచేసినట్లు తన భర్తకు ఎలాగ తెలియటం? [ఇంకావుంది]






బాలనాగమ్మను మాయలఫకీరు ఎత్తుకు పోయినాడన్న వార్త పానుగంటి పట్నమంతా పాక్కింది. పాత్తిళ్లలో ఉన్న పసివాణ్ణి చూసి బాలనాగమ్మ అక్కలు, "అయ్యో, తండ్రీ! యెంత దురదృష్టవంతుడివిరా! నువు పుట్టకమునుపే నీ తండ్రులు గండికోట వెళ్లారు. నువు పుట్టగానే నీ తల్లిని మాయలవాడు చెర పట్టుకు పోయినాడు" అని ఏడిచారు.

పానుగంటి పట్నంలోనున్న కాపులూ, కరణాలూ, కమ్మ వెలమదొరలూ సభచేసి, తమకు తెలియకుండా మాయలఫకీరు వచ్చి వెళ్లినందుకు చాలా అవమానపడ్డారు. గండికోటకి కబురుపంపాలనితీర్మానించారు. కాని మనుష్యులనుపంపితే ఈకీకారణ్యాలు దాటి ఎప్పటికి పోను? అందుచేత డేగలను పైకి తీశారు. బాలనాగమ్మకు కొడుకుపుట్టాడనీ, ఏడురోజుల పచ్చి బాలింతరాలిని నాగళ్లపూడి గట్టుఏలే మాయలఫకీరు చెర బట్టుకు పోయినాడనీ, చంటిబిడ్డను దాదులు పాలిచ్చి పెంచుతున్నారనీ జాబులు రాసి డేగలమెడలకు కట్టి, ఊరు బైట వాటిని వదిలేశారు. మూడుజాముల కల్లా డేగలు గండికోటకు వచ్చి వాలాయి.

జాబులలో ఉన్నవార్త వినగానే ఏడుగురు అన్నదమ్ములూ బాకులు దూశారు. వారి వెంట పన్నెండువేల సేన ఉన్నది. రెండు వందల ఫిరంగులు ఉన్నవి. ఈ సైన్యంతో నాగళ్లపూడి గట్టుమీద పడి, రాముడు రావణాసురుణ్ణి సంహరించి సీతామ్మవారిని తెచ్చినట్టు, ఫకీరువాణ్ణి చంపి బాలనాగమ్మను తెచ్చుకోవటానికి సన్నాహం చేశారు. శంఖాలు మోగాయి. దండుబూరలు మోగాయి. గుర్రాలమీద



ఢంకా మోగింది. అట్టహాసంగా సైన్యం కదిలింది. పులిరాజు పట్టణమూ, గంగవాది పట్టణమూ వాటి నాలుగోరోజుకు సైన్యం నాగళ్ళపూడి గట్టు చేరి కోట నాలుగువైపులా ముట్టడించారు. ఘడియ పొద్దెక్కేసరికి ఫిరంగులు బారు చేసి మూడు వరసలు కాల్చారు. కాని, ఒక్క గుండుకూడా కోటకి తగలలేదు, కోటలోపల పడలేదు. గుళ్లన్ని మధ్య దారిలోనే పగిలిపోయాయి. కోట గోడకున్న ఇంత సున్నపు బెత్తికఅయినా ఊడలేదు, ఫకీరువాడి మహిమ!

ఇన్నిఫిరంగులూ మూడు రోజులు పేల్చినా కోట గోడలమీద మనుష్యులు కనిపించక పోయేవరకు కోటలో అసలు మనుష్యు లున్నారా అని రాజులకు సందేహం కలిగి బురుజులకు నిచ్చెన లెత్తించి కొందరు మనుష్యులను గోడల పైకి ఎక్కించారు. కోటలోపల ఎక్కడా ఒక మగపురుగు లేదు. ఫకీరు చెరపట్టి తెచ్చిన ఆడజనం అక్కడక్కడా కని పించారు. చివరకు మసీదుబయట పట్టె మంచంమీద పడుకుని చల్లగాలికి నిద్ర పోతున్న ఫకీరు కనిపించాడు. వాణ్ణి చూడ



గానే ఫిరంగులను గిలకలమీద బురుజుల పైకి ఎత్తించారు.

ఈలోపుగా గాండ్లసంగు కోటగోడలమీద మనుష్యులను చూసి, "లేవరా, ఫకీరూ, నీ పొగరు అణచటానికి శత్రువు లొచ్చారు. నిన్ను హతమారుస్తారు, లే!" అని నిద్ర లేపింది. కాని ఫకీరు లేవలేదు. గరిటె ఎర్రగా కాల్చి అంటించినా వాడు గుర్రు పెట్టి నిద్రపోతూనే ఉన్నాడు.

రాజులు ఫిరంగులు బారుచేసి మాయల ఫకీరు మీద పేల్చారు. ఏవో నల్లులు కుడుతున్నా యనుకొని ఫకీరులేచి చూశాడు. శత్రువు లొచ్చారని కనుక్కున్నాడు. వెంటనే బాలనాగమ్మను తీసుకొని మశీదు పైకి ఎక్కాడు. బాలనాగమ్మ మశీదుపైనుంచి తన భర్తనూ, బావగార్లనూ, వారి సైన్యాలనూ చూసి పెద్ద పెట్టున ఏడిచింది.

అది చూసి ఫకీరు, "ఎందుకే ఏడుస్తావు? వీళ్లు మనల్ని ఏమైనా చేస్తారను కున్నావా? మనకేమీ భయంలేదు. నా దెబ్బ చూడు," అంటూ ఒక లాఠీ తీసి దాన్ని మంత్రించి పంపాడు. అది కోట దాటిపోయి శత్రువులతో యుద్ధం చెయ్యసాగింది. దాని దెబ్బకు తట్టుకోలేక సైనికులు



పారిపోసాగారు. లాఠీ మూడువందల మందిని చంపి ఫకీరుచేతికి తిరిగి వచ్చింది.

"ఇప్పుడు మనం స్వయంగా వెళ్లి లడాయిచేస్తాం," అంటూ ఫకీరు, కుల్లాయి పెట్టి, కంబళి నడుముకు చుట్టి, కర్ర చేతపట్టి, గుప్పెడు విభూతి తీసుకుని, "యారే అల్లా, యారే ఖుదా" అనుకుంటూ తూర్పు దర్వాజాగుండా కోటదాటి శత్రు సైన్యాల మధ్యకు వచ్చాడు. తక్షణం పన్నెండు వందల సైనికులు ఫకీరును చుట్టుముట్టి ఏ కండ కా కండ నరికేశారు. మరుక్షణమే వాడు ఇంకోమూల పుట్టాడు. అక్కడకూడా వాణ్ణి తల కొట్టేశారు.

ఈవిధంగా వాణ్ణి నరుకుతూనే ఉన్నారు, వాడు మళ్లీ పుడుతూనేఉన్నాడు. ఆఖరుకు సైనికులు విసిగి, వాణ్ణి చంపి దహనంచేసి బూడిదఎత్తి చెరువులో పోశారు. చెరువునీటి లోంచి ఫకీరులేచివచ్చి, "ఒరే, ఇంతవరకు లడాయిమీది. ఇక మా లడాయి చూడండి" అని చేతిలోవిభూతి అన్నివేపులా చల్లాడు.

వెంటనే రాజుల ఏనుగలన్నీ నల్లరాళ్లు ఐపోయాయి. గుర్రాలు నాపరాళ్లయాయి. ఒంటెలు ఎర్రరాళ్ళయాయి. పన్నెండు వేల బలగమూ రాళ్లగుట్ట లయిపోయారు. ఫిరంగులు నీళ్లకుండలయాయి. ఏడుగురు రాజుల డేరాలూ గోరింటపొద లయి పోయాయి. ఏడుగురు రాజులూ పుట్టలై పోయారు. రాజుల వెంటవచ్చిన ముగ్గురు మంత్రులూ శిలలయినారు. ఈ విధంగా సైన్యం యావత్తూ ఒక్కసారిగా మాయ మైపోయింది. ఎక్కడా ఏ అలికిడీ లేదు.

మాయల ఫకీరు బాలనాగమ్మ దగ్గరికి తిరిగిపోయి, "చూడవే, భామా, ఇక మన ఇద్దరికీ అడ్డులేదు. రా, ఒక్క ముద్దియ్యి," అంటూ ఆమెను కౌగిలించుకోబోయాడు.

"ఓరీ, ఫకీరూ, నా పన్నెండేళ్ళ వ్రతం పూర్తికాకుండా నన్నంటితే తల పగిలి చస్తావు, జాగ్రత్త," అన్నది బాలనాగమ్మ.





ఏడుగురు రాజులూ పన్నెండువేల బలగమూ ఒక్కసారిగా చచ్చిపోయారన్నవార్త రాగానే పానుగంటిపట్టణమంతా ఆర్తనాదాలతో దుఃఖసముద్రంలో మునిగిపోయింది. పట్టణానికే వైధవ్యం కలిగినట్టయింది. బాలనాగమ్మ అక్కలు ఆరుగురూ భర్తలకోసం గొల్లున ఏడిచారు. తలలు పగలగొట్టుకోబోయినారు. కాని వారుకూడా చస్తే ఇక బాలనాగమ్మ కొడుకును యెవరు చూస్తారు? ఆరుగురూ గుండెలు రాళ్లుచేసుకొని, వెంట్రుకతో కొండపాకిన చందంగా, ఆ కుర్రవాణ్ణి చూసుకుంటూ రోజులు గడపసాగారు.

బాలనాగమ్మ కొడుకు బాలవద్దిరాజు క్రమంగా పెరిగి పెద్దవాడు కాసాగాడు. అయిదోయేడు రాగానే అక్షరాభ్యాసం చేయించారు. ఒక్క ఘడియలో ఓనామాలు పూర్తిచేశాడు. మరోఘడియకల్లా గుణింతాలు వచ్చేశాయి. చూస్తుండగానే బాలవద్దిరాజు బాలరామాయణమూ, అమరమూ, గజేంద్రమోక్షమూ, భారత భాగవత రామాయణాలూ, కావ్యాలూ, అలంకారాలూ చదివి పూర్తిచేసేశాడు.

చదువు పూర్తికాగానే రోజుకు వరహా జీతం ఇచ్చి ముగ్గురు జట్టీలను ఏర్పాటు చేశారు. బాలవద్దిరాజు గరిడీ సాములు నేర్చాడు. దండాలూ, గుంజీలూ తీశాడు. జోడీలు తిప్పాడు. కత్తిసాము నేర్చాడు. విల్లూ బాణమూ నేర్చాడు. బాలుడి ప్రజ్ఞ చూసి ఊళ్ళోవాళ్ళంతా సంతోషించారు. తండ్రులకు కీర్తి తెస్తాడన్నారు.

ఇట్లా ఉండగా ఒకనాడు సంబివారి నరసమ్మ కడవ బుజాన పెట్టుకొని నీళ్లకు పోతూ ఉండగా చూచి బాలవద్దిరాజు తనకేపాటి గురి ఉందో చూచుకోవటానికి బాణం ఎక్కుపెట్టి వదిలాడు. నరసమ్మ చేతిలో కుండ పుటుక్కున పగిలి, ఆమె

బొటనవేలికి ములికి తగిలి నెత్తురుబొట్లు కారాయి. అది చూసుకుని కోపంవచ్చి నరసమ్మ, "నీ తల్లి బాలనాగమ్మను, మహా ఇల్లాలిని ఆ ఫకీరువాడట్లా చెర పట్టుకు పోయాడు గాని నీకు మాత్రం చావు రాకపోయె." అని తిట్టింది.

ఈ మాటలువిని బాలవద్దిరాజు నిర్ఘాంత పోయాడు. అమాట మళ్లీ చెప్పమని బతిమాలాడు, బెదిరించాడు. నరసమ్మ కథ అంతా చెప్పింది. తన తల్లి బాలనాగమ్మను మాయలఫకీరు చెరపట్టి నాగళ్లపూడిగట్టుకు తీసుకుపోవటమూ, వాడిమీదికి దండెత్తి పోయిన తన తండ్రులు ఏడుగురూ రాళ్లయి పోవటమూ బాలవద్దిరాజుతెలుసుకున్నాడు.

"ఇదంతా నాకు తెలియదు. నన్ను తిట్టమాకు, నరసమ్మా. దీవించు. నేను నీ కొడుకును, నీవు నా తల్లివి," అన్నాడు.

"వర్ధిల్లు, నాయనా, బాలవద్దిరాజా! నువు వెళ్లి నీ తల్లిని రక్షించుకురా. ఆ మాయల ఫకీరు నీ చేతిలో చస్తాడులే," అని నరసమ్మ దీవించింది.

బాలుడు గరిడీకి తిరిగివచ్చి దానికి తాళం పెట్టేశాడు. నేరుగా ఇంటికివెళ్లి ఆలోచిస్తూ పడుకున్నాడు. స్నానానికి



లేవమంటే లేవడు. అన్నం తినడు. పిలిస్తే పలకడు.

"ఎవరైనా తిట్టారా, కొట్టారా? ఎందుకు రాపలకవు?" అని తల్లులు బతిమాలారు. చివరకు బాలవద్దిరాజు, "మా అమ్మ ఎవరు? నాన్న ఎవరు?" అని అడిగాడు.

"మేమే నీకు అమ్మలం. నీ తండ్రులు చచ్చిపోయారు." అన్నారు వాళ్లు.

"మీ ఆరుగురికడుపునా నేను పుట్టానా? మీలో నన్ను కన్నదెవరు? చెబుతారా. చెప్పరా?" అన్నాడు బాలుడు.

"అయ్యో, తండ్రీ, నీ కిదంతా ఏ గొడ్డు మోతుముండ చెప్పిందిరా? పిల్లల్ని కన్న

తల్లి ఎవతె అయినా చెబుతుందా?" అని వాళ్లు శాపనార్థాలు పెట్టసాగారు.

"ఒకరిని ఎందుకు తిడతారమ్మా? మీకు వచ్చిన భయమేమీ లేదు, నా తలిదండ్రు లెవరో, వాళ్ళ కథ ఏమిటో చెప్పండి." అన్నాడు బాలుడు.

ఇక దాచి లాభం లేదనుకుని వాళ్ళు జరిగినదంతా చెప్పి, "ఈ వంశానికి నువ్వొక్కడవు దక్కావు, నాయనా, నిన్ను మేము పువ్వుల్లో పెట్టి పెంచాము," అన్నారు.

"నేను వెళ్లి మా తల్లిని చూసివస్తాను. అనుజ్ఞ ఇవ్వండి," అన్నాడు బాలుడు.

"అయ్యో, నాయనా! నువ్వు అక్కడి కెట్లా పోతావు? పన్నెండువేల బలగాన్ని పాట్టన పెట్టుకున్నాడే, ఆ మాయల ఫకీరు నిన్ను బతకనిస్తాడా? నువ్వు నిజంగానే పోదలచుకుంటే మా అరుగురికీ నీ చేతి మీదిగానే ఇంత విషంపెట్టి, మమ్మల్ని ఇంత బూడిదచేసి ఆతరవాత వెళ్ళు. మేము నీకోసం బతికుండి ఏడవలేము," అన్నారు తల్లులు.

"మీ రేమీ భయపడకండి. నేను నాగ మల్లె విత్తులు తెచ్చి అంతఃపురంలో నాటుతాను. నేను ఎన్నిసార్లు అన్నం తింటానో అన్నిసార్లు వాటికి మీరు నీరుపొయ్యండి. నాగమల్లెలు బతికున్నంతకాలమూ నేను క్షేమంగా ఉన్నా ననుకోండి. అవి ఎండి పోయినప్పుడు నేనిక లేననుకోండి." అని బాలుడు వాళ్ళకి నమ్మకం చెప్పాడు.

బాలుడికి భోజనం పెట్టారు. అన్నం మూటగట్టి ఇచ్చారు. తండ్రిగారి నగలు పెట్టారు. బాలుడు చారేడేసి పోగులు పెట్టాడు. మురుగులు, గొలుసులు, చంద్ర హారాలు, రవలహారాలు, జాలరు వరహాలు ధరించాడు. తాతగారి చంద్రాయుధం మొలలో పెట్టాడు. రత్నకంబళి పైన వేసుకొని అరుగురు తల్లులకు దణ్ణంపెట్టి ప్రయాణమైనాడు. [ఇంకావుంది]






పానుగంటి పట్టణం వదిలి అడవిమార్గం గుండా బాలుడు పగలల్లా నడిచాడు. ఎనిమిదామడ నడిచినా ఎక్కడా ఒక ఊరు తగలలేదు. చీకటిపడిపోయింది. వెంట తెచ్చుకున్న అన్నం తినేసి బాలుడు ఒక మర్రిచెట్టుకింద కంబళి పరచుకొని నిద్ర పోయినాడు. అతను తెల్లవారి నిద్రలేచే సరికి పన్నెండు శిరస్సులుగల నాగరాజు తలదగ్గిర పడగలువిప్పి కనుపించాడు. సర్పరాజు తనకు అపకారం చెయ్యటానికి వచ్చాడనుకుని బాలుడు చంద్రాయుధం దూశాడుకాని ఎత్తినచెయ్యి ఎత్తినట్టేఉంది.

బాలుడితో నాగరాజు ఇలా చెప్పాడు:


"బాలవద్దిరాజా, మీతల్లి బాలనాగమ్మ మా నాగేంద్రుడి వరాన పుట్టింది. కనుక నువు నా మనమడవు. నువు మీ తల్లిని తీసుకొస్తావు. నీ చేతిలో మాయలఫకీరుకు చావున్నది. కాని నీకొక చిన్న గండం ఉంది. నాగళ్ళపూడి గట్టున ఫకీరు ఒక శక్తిని కాపలిపెట్టాడు. అది మాయవేషం వేసుకుని తక్కుతూ, తారుతూ నీ దగ్గిరికి వస్తుంది. దానిమాయలో పడకు. జాగ్రత్త."

ఈ మాటలు విని బాలవద్దిరాజు నాగరాజుకు సాష్టాంగపడి ఆశీర్వాదం పొందాడు. ఆ పగలల్లా నడిచి అతను పులిరాజుపట్నం చేరుకుని పొద్దుకూకే వేళకు పూటకూళ్ల పెద్దమ్మ ఇంటికెళ్లాడు.

బాలుడు అన్నం నీళ్లూ లేకుండా చాలా దూరంనుంచి వచ్చాడని పూటకూళ్ల పెద్దమ్మ చప్పున పొయ్యి రాజేసి నాలుగు కూరలు తరిగి వంట ఆరంభించింది.

"ఏమిటవ్వా, ఈ ఊళ్లో విశేషాలూ?" అన్నాడు బాలుడు.

"విశేషా లేమున్నాయి, నాయనా? మంచినీరు ముట్టి 'ఆరునెల్లయిందిగదా!" అన్నది పూటకూళ్ళ పెద్దమ్మ.



"అదేం, పెద్దమ్మా?"

"తాగటానికీ ఉప్పునీళ్లే, వంటకీ ఉప్పునీళ్లే, పప్పుడక్క చస్తున్నామంటే నమ్ము."

"మీ ఊరికి మంచినీళ్ళ బావి లేదా?"

"ఉంటే ఏం లాభం, నాయనా? మా ప్రాణంమీదికి పులి ఒకటి దాపరించెగా?"

"చెప్పవూ? ఎక్కడుందా పులి?"

"నువు వినలేదు గామాలు. మావూరి కోట ఉత్తరపు గోడ అవతల మంచినీళ్ళ బావిదగ్గిర చేరింది ఒక పాపిష్టి పులి. ఆరు నెల్లనుంచీ అటుకేసి వెళ్లినవారి నందర్నీ చంపుకు తింటున్నది. దాన్ని చంపటం ఎవరివల్లా కాలేదు." అన్నది పెద్దమ్మ.

"మీ ఊరి రాజుగారేంచేస్తున్నారు?"

"ఏం చేస్తారు? పద్దెనిమిది కులాల వాళ్ళలో ఎవరు పులిని చంపినా తన కూతుర్నిచ్చి పెళ్లి చేస్తానని చాటించారు. మూడుమూరల కాగితంమీద అదే రాయించి నడివీధిలో అంటించారు. కాని పులినిచంపే నాథుడేడీ?"

బాలుడు భోంచేసి పడుకున్నాడు. తెల్లవారే లేచి స్నానంచేసి, చద్దిఅన్నం తిని రత్నకంబళి పైన వేసుకుని బయలుదేరి, ఉత్తరపు దరవాజా దగ్గిరికివచ్చాడు. దరవాజా తాళంవేసిఉంది గాని అక్కడ కాపలావాళ్లున్నారు. "ఎవరోయ్? ఈ తలుపు తాళం వేశారేం? తియ్యండి. నేనిటు వెళ్లాలి," అన్నాడు బాలుడు.

"ఇటు నడవటం మానేశారు. తూర్పు దరవాజాకుండాపో" అన్నారు కాపలావాళ్లు.

"నేనిటే పోవాలి." అన్నాడు బాలుడు.

"అబ్బాయీ, ఉన్నమాట చెప్పకపోతే మాకు పాపం చుట్టుకుంటుంది. ఇక్కడకు దగ్గిరిగా మంచినీటి బావిదగ్గిర పెద్ద పులి ఉంది. అందిన వాణ్ణల్లా చంపుకు తింటుంది," అన్నారు కాపలావాళ్లు.

"ఏదీ? ఆ పులిని ఒకసారి చూద్దాం, తలుపులుతెరవండి", అన్నాడు బాలుడు.

కాపలావాళ్ళు తలుపులు తెరిచి, బాలవద్దిరాజును బయటికి పోనిచ్చి మళ్లీ తలుపులకు తాళాలు పెట్టారు.

బాలవద్దిరాజు పులిని వెతుక్కుంటూ మంచినీళ్ల బావి దగ్గిరికి వెళ్లాడు. పులి ఆహారం వెతుక్కుంటూ వస్తూ బాలుణ్ణి చూసి గాండ్రిస్తూ మీదకు దూకింది. బాలుడు చంద్రాయుధం దూసి దాని కుత్తుకలో పొడిచేశాడు. పులి వెల్లికిలాపడి తన్నుకు చచ్చింది. బాలుడు దాని కాళ్ళ గోళ్లూ, తోక చివరభాగమూ కోసుకుని తూర్పు దర్వాజాగుండా పట్నం ప్రవేశించి పూటకూళ్ల పెద్దమ్మ ఇంటికి తిరిగొచ్చాడు.

"ఎక్కడికి పోయినావు, నాయనా?" అన్నది పెద్దమ్మ.

"పట్నం చూడబోయినాను. ఎంత చూసినా తనివి తీరటం లేదు. ఒకటి రెండు రోజులుండిగాని పోను!" అన్నాడు.

ఇది ఇట్లా ఉండగా ఆ పట్టణంలో తిప్పడనే చాకలి ఒకడున్నాడు. వాడు వట్టి పనికిమాలిన వెధవ. మూడునెల్లకొకసారైనా బట్టలకు వెళ్లేవాడు కాడు. ఎప్పుడూ తప్ప తాగి ఒళ్లు తెలియకుండా ఉండేవాడు.

ఆవాళ వాడు యథాప్రకారం తప్పతాగి మళ్లీ ఊళ్లోకి వస్తూ, ఎటుపోతున్నదీ తెలీక మంచినీళ్ల బావిదగ్గిరికి వచ్చాడు. అక్కడ






దారికడ్డంగా పులి కనిపించింది. ఆ నిషాలో వాడికి భయంకూడా కలగలేదు. చేతిలో ఉన్న దుడ్డుకర్ర ఎత్తి దబాదబా నాలుగు బాదాడు. పులి కదల్లేదు, మెదల్లేదు. తొంగి చూశాడు. చచ్చినట్టు కనిపించింది. కాలితో తన్ని చూశాడు. నిజంగా చచ్చింది.


తిప్పడు "నా రంగా. రాజుకూతుర్ని పెళ్లాడతా గామాలె! రాజునౌతా గామాలె! అంతా నా కాళ్లకాడ మొక్కుతారు గామాలె!" అనుకుని రాజుగారి ఆస్థానానికి పరిగెత్తసాగాడు. దారిలో అందరూ వాణ్ణి చూసి ఆశ్చర్యపడ్డారు. ఎవరైనా వాణ్ణి అడ్డం తగిలి పలకరిస్తే వాళ్లని ఒక్కతోపు తోసి పరిగెత్తుతూ దివాణం చేరాడు. రాజుగారిదగ్గిర సాష్టాంగపడి, "మహాప్రభూ, నేను మంచినీళ్ళ బావికాడ ఉన్న పులిని చంపేశాను. కావలిస్తే శవాన్ని పరీక్ష చేసి నాకు తమ కూతుర్ని ఇచ్చి వివాహం చేయించండి" అన్నాడు.

రాజుగారూ, రాజబంధువులూ కూడా ఈ వార్త విని నిర్ఘాంతపోయినారు. మహామహావాళ్లు చంపలేక పోయిన పులిని ఈ తాగుబోతు చంపుతాడని ఎవరనుకొంటారు? రాజుగారికూతుర్ని తిప్పడికిచ్చి చెయ్యటం ఎట్లా? ఆడినమాట తప్పటం ఎట్లా?

రాజుగారి మనుషులు వెళ్లి చచ్చిపోయిన పెద్దపులిని పరీక్షించారు. పులి చచ్చినమాట నిజమేనని తేలింది. చాకలి తిప్పడు పులిని చంపాడు కనక, మంచి ముహూర్తం చూసి వాడికి రాజుగారి కూతురు సుభద్రాదేవిని ఇచ్చి పెళ్లి చేస్తామని రాజుగారు చాటింపించారు.

రాజుగారింట ఎవరిముఖానా ఆనందం లేదు. సంబరమంతా చాకలి తిప్పడిది. వాడు తన పెళ్ళాన్ని చావచితకగొట్టి తన బంధువులనందర్నీ పిలిచి అందరికీ కల్లు పోయించి అప్పుడే ఒక దర్బారు చేసి తెల్లవార్లూ ఉత్సవం చేసుకున్నాడు.






పూటకూళ్ళమ్మ ఈ సాక్ష్యం పట్టుకుని రాజుగారి దివాణానికి వెళ్ళింది.

తెల్లవారేసరికల్లా తిప్పడి ఇంటికి, రాజ భటులు వచ్చి వాణ్ణి పెడరెక్కలు విరిచి కట్టి, జైలుకు తీసుకుపోయినారు. అదే సమయంలో పూటకూళ్ల పెద్దమ్మ ఇంటికి రాజుగారు పల్లకీ ఎక్కివచ్చి బాలవర్ధి రాజును ఎక్కించుకుని తన నగరుకు పోయి సకల మర్యాదలూ జరిపాడు.

పులిరాజు తనకు సుభద్రనిచ్చి పెళ్ళి చెయ్యటానికి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలియగానే బాలవర్ధిరాజు, "నేను మా తల్లిని చెరవిడిపించ బోతున్నాను. అందు చేత ఇప్పుడు పెళ్లి చేసుకోవటం భావ్యం కాదు. మా అమ్మతో సహా తిరిగివచ్చే టప్పుడు ఇక్కడ ఆగి పెళ్లి చేసుకుని మా వూరు పోతాను," అన్నాడు.

బాలుడు చెప్పినదానికి పులిరాజు సరే నని నాగంభొట్లనే బ్రాహ్మణుణ్ణి తోడిచ్చి పంపాడు. పులిరాజుపట్నానికీ, గంగవాది పట్నానికీ పన్నెండామడ దూరం. రెండు జాములు పొద్దెక్కేవరకూ ఇద్దరూ నడి చారు. బాలుడికి దాహమయింది. బ్రాహ్మడు బావి చూపిస్తాను రమ్మని

ఇక్కడ పూటకూళ్ళ పెద్దమ్మ ఇంటో బాలవర్ధిరాజు భోజనం చేసి అలిసిపోయి నిద్రపోయినాడు. పూటకూళ్ళమ్మకు ఏదో అనుమానం తగిలింది. బాలుడు ఏదో చేసి వచ్చాడని ఆమెకు సందేహం కలిగింది. ఇంతలో చాకలి తిప్పడు పులిని చంపా డన్న చాటింపు వినపడింది. బాలుడు నిద్ర పోతుండగా పూటకూళ్లమ్మ అతని చంద్రా యుధం తీసి పరీక్ష చేసింది. పూటకూళ్లమ్మ సందేహం జాస్తి అయింది. ఇంతలో పులి గోళ్ళ మూట ఆమె కంట పడింది. విప్పి చూస్తే అందులో పులిగోళ్లూ పులి తోక ముక్కా కనిపించాయి. అర్ధరాత్రివేళ



పక్కదారి పట్టించి, ఒక పాడుపడిన నూతి దగ్గిరికి తీసుకుపోయినాడు. ఆ బావిలో నీరు లోతుగా ఉంది. లోపలిపక్కల రేగు పొదలున్నాయి. నీరు చేదుకునేటందుకు చేదలేదు. అందుచేత నడుముకి బాలవద్ది రాజు పాగా చుట్టుకుని ముందుగా బ్రాహ్మణుడు బావిలో దిగి నీర్సు తాగి పైకి వచ్చాడు.

పైకి వచ్చిన బ్రాహ్మణుడు, "అబ్బాయీ, బావి చాలా లోతుగా ఉన్నది. నిలువునా రేగుకంపలున్నాయి. నీ నగలూ, కత్తీ తీసిపెట్టి దిగు. లేకపోతే నిష్కారణంగా కంపలకు చిక్కుకుని నీటిలో పడిపోతాయి." అని చెప్పాడు. బాలుడు బ్రాహ్మడి మాటలు నమ్మి తన నగలూ, కత్తీ తీసి ఒడ్డున పెట్టి, నడుముకు పాగా చుట్టుకుని బావిలోకి దిగాడు. బాలుడు బావిలో దిగిందే వ్యవధానంగా బ్రాహ్మడు కత్తితో పాగా కోసి, బాలుడి నగలూ కత్తీ అపహరించి, గంగవాదిపట్నం వెళ్లి, ఆ నగలు భోగంవాళ్లకిచ్చి విలాసంగా తిరగసాగాడు.

కొంతకాలానికి బ్రాహ్మడిదగ్గిర డబ్బయిపోయింది. ఎవరూ దగ్గిరికి చేరనివ్వలేదు. పొట్ట పోసుకోవటానికి గోపాలస్వామివారి గుడిపక్క రథం దగ్గిర చేరి యాచన ఆరంభించాడు.

ఇక్కడ నాగంభొట్లు పాగా కోసెయ్యగా నీటిలో పడిపోయిన బాలవద్దిరాజు నిద్రాహారాలు లేకుండా ఆ బావిలో చాలాకాలం ఉన్నాడు. ఎన్ని కేకలు పెట్టినా ఆ కీకారణ్యంలో ఆలకించేవారు లేరు. ఇంతలో ఒకనాడు గంగవాదిపట్నం రాజు అడవికి వేటకు పోయి, వేటకుక్కలకు నీరు పెట్టటానికిగాను ఈ పాడుబడ్డ బావిదగ్గిరికి పరివారంతోకూడా వచ్చాడు. రాజుగారి నౌకర్లు చెంబుకు పాగా కట్టి నూతిలో వెయ్యగానే బాలుడు ఆ పాగా పట్టుకున్నాడు. చెంబు


పైకి లాగేటప్పుడు చాలా బరువుగా వుండటం చూసి నౌకర్లు చాలా ఆశ్చర్యపడ్డారు. వాళ్లధర్మాన బాలవద్దిరాజు ప్రాణాలతో బయటపడ్డాడు.

అతన్ని గంగవాదిరాజు తన ఊరికి తీసుకుపోయి అతని సమాచారమంతా అడిగాడు. బాలుడు అన్ని విషయాలూ చెప్పి, తాను పులిరాజుపట్నంనుంచి వస్తూ సుడిగాలికి బావిలో పడ్డానని చెప్పాడు. గంగవాదిరాజు బాలుడికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానన్నాడు. అందుకు బాలుడు తన తల్లిని మాయలఫకీరు చెర విడిపించనిదే పెళ్లాడననీ, తల్లితో తిరిగి వచ్చేటప్పుడు పెళ్ళాడుతాననీ చెప్పాడు. రాజుగారు సరేనన్నాడు.

ఒకనాడు రాజుగారు బాలవద్దిరాజుకు గోపాలస్వామివారి గుడి చూపించటానికి తీసుకువెళ్ళాడు. అక్కడ రథం దగ్గిర కూర్చుని ఉన్న బ్రాహ్మణ్ణి చూసి బాలుడు "నమస్కారమయ్యా, నాగంభొట్లూ," అన్నాడు. బ్రాహ్మడి మొహాన కత్తి వేస్తే నెత్తురుచుక్క లేదు.

బాలవద్దిరాజు రాజుతో చెప్పి ఆ బ్రాహ్మడికి చాలా సహాయం చేయించాడు. మర్నాడు బాలుడు రాజుగారిచ్చిన కానుకలు పుచ్చుకొని మళ్లా బయలుదేరాడు. రోజల్లా నడిచాడు. చిలుకవాదిపట్టణం రెండుకోసు లుందనగా చీకటి పడిపోయింది. చీకటిలో కాలు సాగక బాలుడు అక్కడే ఉన్న ఒక పాడుదేవళంలో పడుకున్నాడు. కాని ఆకలి దహించుకుపోతూ ఉండటంచేత అతనికి నిద్ర పట్టలేదు.

ఒక రాత్రివేళ ఒక నక్కా, పులీ దేవళం దగ్గిర చేరి కబుర్లు చెప్పుకోసాగాయి. బాలవద్దిరాజు వాటి సంభాషణ వింటున్నాడు. [ఇంకా వుంది]





# బాలనాగమ్మ

పులీ, నక్కా యిలా మాట్లాడుకో సాగినై.

"పులిబావా, పులిబావా! నాకు రేపు పండగ. రాచకురుపుతో ఆరునెలలనుంచీ బాధ పడుతున్న చిలుకవాదిపట్నం రాజు కూతురు రేపు కడతేరుతుంది. నాకు మంచి విందు." అన్నది నక్క.

"నక్కబావా! ఈ రాచకురుపుకు మందే లేదా?" అన్నది పులి.

"లేకేం? ఈ దేవళంమీద ఏడాకుల మొక్క ఒకటి ఉన్నది. ఈ ఆకులు కురుపుమీద వేసికట్టి మూడోనాడు తీసి చూస్తే కురుపెక్కడ పుట్టిందో ఎవరూ కనుక్కోలేరు" అన్నది నక్క.

ఈమాటలు విన్న బాలుడు తెల్లవార గానే లేచి దేవళంఎక్కి దానిమీద ఉన్న మొక్కకుగల ఏడాకులూ కోసుకుని భట్టీలో బిగించి కట్టి బారెడు పొద్దెక్కే వరకల్లా చిలుకవాదిపట్నం చేరి పూట కూళ్ళపెద్దమ్మ ఇంటికి వెళ్లాడు.

"పెద్దమ్మా, వరహా ఇస్తాను త్వరగా అన్నం వొండిపెట్టు" అన్నాడు బాలుడు.

"అయ్యో, నాయనా! ఇప్పుడు అన్నం వండేటట్టుగా ఉన్నదా? మా రాజు కూతురు రాచకురుపు లేచి కిందట్టూ మీదట్టూగా ఉంది. నేను త్వరగా అక్కడి కెళ్ళాలి. నువు ఇంకెక్కడైనా భోజనం చూసుకో" అన్నది పూటకూళ్ల పెద్దమ్మ.

"నాకు ఇంత తిండి పెడితే మీ రాజు కూతురి వ్యాధి నేనే నయం చేస్తాగా?" అన్నాడు బాలుడు.

"మహామహా వైద్యులు కుదర్చనిదాన్ని నువు కుదుర్చుతావా? అంతఆకలిగాఉంటే చద్ది అన్నంఉంది తిను" అంటూ పెద్దమ్మ బాలుడికి రాత్రి మిగిలిన అన్నం పెట్టింది.



"పెద్దమ్మా, నీతోకూడా నేను కోటలోకి వచ్చి రాజుకూతురుకు వైద్యం చేస్తాను. నన్ను తీసుకుపోతావా?" అని అడిగాడు బాలుడు.

పెద్దమ్మ సరేనన్నది.

అప్పటికే రాజుకూతుర్ని కింద పెట్టే శారు. వైద్యులు నాడి క్షీణిస్తున్నదన్నారు. బాలుడు రాజుగారితో రాజుకూతురి పుండు చూపించమన్నాడు. మహా మహా వైద్యులు ఏమీ చేయలేక పోయినారు గాని ఈ కుర్ర వాడు చేస్తాడా అని అనుకుంటూనే రాజు గారు బాలుడికి తన కూతురి పుండు చూపించాడు. బాలుడు ఛట్టీలోనుంచి ఏడాకులూ తీసి, పుండు కడిగించి దాని మీద ఏడాకులూ వేసి కట్టు కట్టించాడు.

కిందపెట్టిన రాజుకూతురు ఎంతకూ చావలేదు. వైద్యులు నాడి చూసి, "ఇంకా ప్రాణం ఉంది. ఇవాళకు ఫరవాలేదు." అన్నారు. రెండోరోజుకూడా నాడి ఆడు తూనే ఉంది. రాజుకూతురు ఇంకోరోజు కూడా బతుకుతుందన్నారు వైద్యులు.

మూడోరోజు తెల్లవారి బాలుడు రాజు కూతురి కట్టు విప్పించాడు. కురుపు జాడ లేదు. అందరూ ఆశ్చర్యపోయినారు. "నిన్ను ఈశ్వరుడే పంపాడు. నువు సామా న్యుడివి కావు." అన్నాడు రాజుగారు బాలుడితో. ప్రజలంతా సంతోషం పట్టలేక బాలుణ్ణి చూడటానికి ఎగబడ్డారు. అందరూ చూడగలందులకు రాజుగారు తన కుమార్తెనూ, బాలవద్దిరాజునూ పల్లకీలో ఎక్కించి మేళతాళాలతో ఊరు అన్ని వీధులా ఊరేగించాడు.

పదిహేను రోజులు బాలుడు రాజు గారింట గడిపి, శలవు ఇప్పించమని అడిగాడు.

"నాయనా, నా కూతుర్ని బతికించావు. దాన్ని నువే పెళ్ళాడు" అన్నాడు రాజు.



బాలుడు తన వృత్తాంతమంతా చెప్పి, "నాగళ్లపూడి గట్టున మాయలఫకీరు చెరలో ఉన్న మా అమ్మను విడిపించి వచ్చేటప్పుడు నేను మీ అమ్మాయిని పెళ్ళాడుతాను." అని రాజుగారిచ్చిన నగలూ అవీ పుచ్చుకొని బయలుదేరి నయనవాడిపట్నం చేరాడు. అక్కడ భోం చేసుకుని నాగళ్ళపూడి గట్టుకు వచ్చాడు. దూరాన మసీదు కోట కనిపిస్తున్నాయి.

"ఆ మసీదులోనేగదా మా అమ్మ చెర ఉన్నది! ఆ కోటచుట్టుగదా మాతండ్రులు శిలలైనారు!" అనుకున్నాడు బాలుడు.

బాలు ఈవిధంగా నాగళ్ళపూడిగట్టు సమీపిస్తూ ఉండగా, మాయలఫకీరు ఆ గట్టుమీద కాపలా ఉంచిన పొలిమేరశక్తి అతన్ని చూసింది. పదహారేళ్ళ బాల కుమార్తె వేషం ధరించి తక్కుతూ తారుతూ ముసిముసినవ్వులు నవ్వుతూ బాలుడికెదురుగా వచ్చింది. ఆ వచ్చేది తనను చంపటానికి మాయలఫకీరు ఉంచిన పొలిమేరశక్తి అని బాలుడు వెంటనే గ్రహించి అది దగ్గిరికి రాగానే తన మొలలో ఉన్న బాకు తీసి దాన్ని చంపబోయినాడు.



పొలిమేరశక్తి గడగడా వొణుకుతూ "అయ్యో, నన్ను చంపకు. నీకు మీ అమ్మ కనిపించే ఉపాయం చెబుతాను" అన్నది.

"ఉపాయం చెబితే నిన్ను ప్రాణాలతో వొదుల్తాను." అన్నాడు బాలుడు.

"ఈ నాగళ్ళపూడి గట్టుమీద తంబళ్ళ పెద్ది ఉన్నది. అది ఫకీరుకు దండలు కడుతుంది. దాని ఇంటికి పోయి దాహం అడుగు. ఎవరబ్బాయీ నువ్వు అని అడిగితే మీ తండ్రిపేరు తంబళ్ల శరబయ్య అనీ, మీ తల్లిపేరు నాగమ్మ అనీ, నీపేరు వీరయ్య అనీ చెప్పు. మీ అమ్మా నాయనా చచ్చిపోయారని కూడా చెప్పు. ఆతర్వాత నీకు మీ అమ్మ కనిపిస్తుంది," అని చెప్పి పొలిమేరశక్తి బాలుడికి తన చేతి బెత్తం ఇచ్చింది.

బాలవర్ధిరాజు తంబళ్లపెద్ది ఇంటికి పోయి పొలిమేరశక్తి చెప్పినట్టే చేశాడు. "అయ్యో, మనమడా!" అంటూ తంబళ్ళ పెద్ది బాలుణ్ణి కౌగిలించుకున్నది.

"మీ అమ్మా, నాన్నా కులాసాగా ఉన్నారా నాయనా?" అని అడిగింది తంబళ్లపెద్ది.

"ఇద్దరూ చచ్చారు" అన్నాడు బాలుడు.

తన కూతురూ, అల్లుడూ చచ్చారని వినగానే పెద్ది చాలా విచారించి మనమణ్ణి తనదగ్గిరే ఉండమన్నది.

తంబళ్లపెద్ది రోజూ మాయలఫకీరుకు దండలు కడుతుంది. బాలుడు, "అవ్వా, నేనుకూడా మంచి దండలు కడతాను" అన్నాడు.

"కట్టు, నాయనా," అన్నది పెద్ది.

బాలుడు మాయలఫకీరు మనసు రంజించేటట్టుగా పెద్దపెద్ద దండలు. రకరకాల ఆకారాలలో కట్టాడు. తన తల్లి బాలనాగమ్మ కని ఒక దండ చిక్కిరి



బిక్కిరిగా కట్టి అందులో తన వేలి ఉంగరం ఉంచాడు. వాటన్నిటినీ తంబళ్ల పెద్ది కిచ్చి పంపాడు.

దండలు చూసి మాయలఫకీరు చాలా సంతోషించి ఎవరు కట్టారని అడిగాడు. నా కూతురి కొడుకు కట్టాడని చెప్పింది పెద్ది. వాడు మూడు రోజులయి పడమట నుంచి వచ్చాడన్నది.

మాయలఫకీరు పెద్ది జీతం పెంచి, పిల్లవాడికి బాగా భోజనం పెట్టి చక్కగా పెంచమన్నాడు.

తంబళ్ళపెద్ది బాలనాగమ్మ మేడకు వచ్చి ఆమె దండ ఆమెకిచ్చింది. "నాకు దండలే తక్కువయాయా ?" అంటూ బాలనాగమ్మ పెద్ది ఇచ్చిన దండను గిర వాటు వేసింది. దండ గోడకు తగిలి ఉంగరం కింద పడింది.

ఆ ఉంగరం చూడగానే బాలనాగమ్మ గుర్తుపట్టి తన కొడుకును చూసినట్లే సంతోషమూ, దుఃఖమూ పట్టలేక పెద్దపెట్టున ఏడుస్తూ, "నా తండ్రీ, నువు పంపించావా ఈ ఉంగరం? నువు వచ్చావా? నువెందుకు వచ్చావురా తండ్రీ? నిన్ని మాయముండాకొడుకు బతకనిచ్చేనా ! ఈ పాప ఖర్ముడు నీ తండ్రులనందర్నీ తన పొట్టన పెట్టుకున్నాడే!" అని తనలో అనుకుని, ఉంగరం తన చేతికి పెట్టుకుంది.

బాలుడు ఆ రోజు కా రోజు మంచి దండలు, అంతస్తులు అంతస్తులుగా కట్టి ఫకీరును మెప్పించసాగాడు. ఒకనాడు ఫకీరు పెద్దితో "పెద్దూ, నువు నీ మనవణ్ణి తెచ్చి నాకు చూపించు" అన్నాడు.

మర్నాడు దండలు తెచ్చేటప్పుడు, తంబళ్ళపెద్ది బాలుణ్ణి ఫకీరువద్దకు వెంట బెట్టుకుని వెళ్లింది. ఫకీరు కుర్రవాణ్ణి చూసి చాలా సంతోషించి, ఒరే అబ్బాయీ ! నువు దండలు బాగా కడతావు. నీకు ఏనుగలా



గుర్రాలా? ఏం కావాలి, కోరుకో" అన్నాడు.

"అయ్యా నాకవన్నీ దేనికి? నీదగ్గిర పన్నెండు స్తంభాల మసీదున్నదట. అది చాలా అద్భుతంగా ఉందట. దాన్ని నాకు చూపిస్తే సంతోషిస్తాను" అన్నాడు బాలుడు.

"అరే, ఆ మసీదులో పానుగంటి బాల నాగమ్మ వ్రతం చేస్తున్నదిరా. ఆ వ్రతం అయేదాకా నేను మసీదులో అడుగుపెట్ట రాదు. మరేదన్నా కోరుకో!" అన్నాడు మాయలఫకీరు.

"అయ్యా, నువు రాకపోతే, నన్నే వెళ్లి చూసి రానివ్వరాదా?" అన్నాడు బాలుడు.

"అరే, దర్వాజాలు మంత్రంతో బిగించి ఉన్నాయిరా? ఎట్లా తెరుచుకుంటాయి? పోనీ ఆ మంత్రాలు నీకు చెబుతాను. వెళ్లి మసీదు చూసి రా!" అని మాయలఫకీరు బాలుడికి మసీదు తలుపులు తెరిచి మూసే మంత్రాలన్నీ చెప్పాడు.

బాలవర్ధిరాజు మసీదులో అడుగుపెడుతూనే మూర్తీభవించిన ఒక దేవతవలె కూర్చున్న తన తల్లిని చూసి, అడుగులో అడుగు వేసుకుంటూ ఆమెను సమీపించాడు.

బాలనాగమ్మ తల ఎత్తి అతన్ని చూడలేదు. ఆ వచ్చేది మాయలఫకీరేనని ఆమె నమ్మకం. బాలుడి పాదాలు ఇంకా అంతదూరంలో ఉండగానే ఆమె, "ఓరీ, ఫకీరూ! ఇంక ఒక్క అడుగు ముందుకువచ్చావా, తల పగిలి చస్తావు!" అన్నది.

దానికి బాలుడు, "అమ్మా! నేను మాయలఫకీరును కానమ్మా! నీ కొడుకు బాలవర్ధిరాజును! నాకేసి చూడు!' అన్నాడు.

బాలనాగమ్మ అనుమానంతో తల పైకెత్తి చూసి, "ఏమో ఎట్లా నమ్మటం?

ఫకీరు మాయవేషా లెన్నయినా వేస్తాడు,' అన్నది.

"నేను నీ కొడుకునే! ఫకీరుముండా కొడుకును కడతేర్చి నిన్ను రక్షించటానికి ఎన్నో శ్రమలుపడి వచ్చాను. నా ఉంగరం కూడా నీకు తంబళ్లపెద్దిచేత పంపించాను. త్వరగా తిరిగి పోకపోతే ఫకీరు అనుమానిస్తాడు. నేను నీతో మాట్లాడాలిసి ఉంది. అనుమానంతో కాలం వ్యర్థం చెయ్యొద్దమ్మా." అని బాలుడు బతిమాలాడు.

ఈ మాటతో బాలనాగమ్మ సందేహం తీరింది. ఆమె చివాల్నలేచి తన కొడుకును కావిలించుకుని, చంటిబిడ్డను ముద్దులాడినట్టు ముద్దులాడింది. ఆమెకు సంతోషమూ దుఃఖమూకూడా పొంగి వచ్చాయి.

"నాయనా, పసివాడివి. మన పన్నెండువేల బలగాన్నీ రాళ్లగుట్టలుచేసి పారేసిన ఈ ఫకీరును నువ్వెట్లా జయిస్తావురా? ప్రాణాలు దక్కించుకుని ఇంటికి తిరిగిపో. నేను నీ కెక్కడి తల్లిని? నిన్ను పెంచి పెద్దచేసిన ఆ అరుగురు అక్కచెల్లెళ్ళే నీ తల్లులు! పో, నాయనా, పో. కంటికి అవుపించావు, చాలు!" అని ఏడవ సాగింది.



బాలుడు ఆమెను కష్టపడి ఊరడించి ఆమెకు రహస్యంగా ఒక అలోచన చెప్పి, తల్లిదగ్గిర సెలవుపుచ్చుకొని, మసీదు తలుపు మళ్లీ మూసేసి ఏమీ ఎరగనట్టు ఫకీరుదగ్గిరికి వచ్చేశాడు.

"ఏం, కుర్రాడా? ఎట్లా ఉంది మసీదు?" అన్నాడు ఫకీరు.

"అయ్యో, ఆ మసీదు అందంచూస్తే ఇక అకలిదప్పులుకూడా తెలియలేదు. విడిచి రాలేక, రాలేక వచ్చేశాను" అన్నాడు బాలుడు.

ఫకీరు నవ్వి, "పిచ్చివాడా, మసీదు చూస్తే కడుపు నిండుతుందా? బాగా

భోంచెయ్యాలి, కడుపునిండాలి. రాజ్యం చేయాలి, సుఖపడాలి,'' అన్నాడు.

బాలుడు తంబళ్ల పెద్దితో సహా ఫకీరు దగ్గిర సెలవుపుచ్చుకొని తిరుగ ఇంటికి వచ్చేశాడు.

మర్నాడు బాలనాగమ్మ పెందలాడే లేచింది. తలంటి పోసుకున్నది. నగలన్నీ పెట్టుకుని చక్కగా అలంకరించుకున్నది. తాంబూలం వేసుకున్నది. ఫకీరుకోసం పెద్దెత్తుగా వంట తయారు చేయించింది. ఫకీరు పూలతోటకు షికారు పోయి తిరిగి వచ్చే సమయంకోసం కాచుకుని ఉండి, వాణ్ణి భోజనానికి ఆహ్వానించింది.

ఫకీరు బాగా భోంచేసి, కల్లూ, సారాయీ తాగి, నల్లమందువేసి, గంజాయిచిలుంపట్టి మంచి హుషారుగా ఉన్న సమయంలో తంబళ్లపెద్ది గొప్పగొప్ప పూలదండలుతెచ్చి ఫకీరుదగ్గిర పెట్టిపోయింది. ఇంతలో బాలనాగమ్మ పాముకూసంలాంటి చీరెగట్టి. నగలతో ధగధగలాడుతూ, తాంబూలం నములుతూ, మందగమనంతో, నవ్వు ముఖంతో ఫకీరుదగ్గిరికి వచ్చి నిలబడింది.

[ఇంకా వుంది]






చక్కగా అలంకరించుకొని వచ్చి తన ఎదట నిలబడిన బాలనాగమ్మను చూడగానే మాయలఫకీరుకు మరింత నిషా ఎక్కిపోయింది.

"ఏం, బాలనాగూ, ఉన్నట్టుండి ఇట్లా మారిపోయినావు?" అన్నాడు.

"నా పన్నెండేండ్ల వ్రతం అయిపోవచ్చింది," అన్నది బాలనాగమ్మ.

ఆమాట వినగానే మాయలఫకీరు చెంగున ఒక్క దూకుదూకి బాలనాగమ్మను కావిలించుకోబోయాడు.

"ఆగు, ఫకీరూ, ఆగు! నన్నంటితే తల పగిలి నిష్కారణంగా చస్తావు. నా వ్రతం ఇంకా తొమ్మిది రోజులున్నది. ఈ తొమ్మిది రోజులూ ఓపికపట్టితివా ఆ తరవాత నీ కడ్డులేదు," అన్నది బాలనాగమ్మ.

"ఆ తరవాత నా దానివైపోతావా?" అన్నాడు ఫకీరు.

"అయిపోతాను. కాని, ఒక్కటి చెబితే నేను సంతోషంతో నీదాన్నవుతాను" అన్నది బాలనాగమ్మ.

"ఏమిటది? నీ కోరిక కడ్డేమిటి?" అన్నాడు ఫకీరు.

"నీ ప్రాణం ఎక్కడున్నదీ చెప్పాలి. నిన్నెవరన్నా చంపేస్తే ఆ తరవాత నాకు దిక్కెవరు?" అన్నది బాలనాగమ్మ.

ఫకీరు బిగ్గిరిగా నవ్వి, "ఓసి పిచ్చిదానా! నా ప్రాణం ఎవరికీ అందేది కాదు. దాన్ని నువు రక్షించనక్కర్లేదు. నేనే రక్షించుకుంటాను," అన్నాడు.

బాలనాగమ్మ చిన్నబుచ్చుకుని, "ఎవరికీ నీ ప్రాణం అందదంటే ఎట్లా



నమ్మటం? కనీసం అది ఎక్కడ ఉన్నదీ చెబితే నాకు ధైర్యంగా ఉంటుంది." అన్నది.

"నరమానవుడి కెవరికీ అందని చోట ఉన్నది. సరేనా?" అన్నాడు ఫకీరు.

"అంత భద్రంగా ఉంటే నాకు చెప్పటానికేం?" అన్నది బాలనాగమ్మ కోపం వచ్చినట్టు నటిస్తూ.

బాలనాగమ్మకు సంతోషం కలిగించటానికీ, తన ప్రాణం ఎంత భద్రంగా ఉందో ఆమెకు తెలియజెప్పటానికీ మాయలఫకీరు తన రహస్యం కాస్తా చెప్పేశాడు.

"సప్తసముద్రాల అవతల జీవిగడ్డ. జీవిగడ్డలో రాతిగోడల మధ్య రాతికోట. రాతికోట నడుమ ఉక్కుకోట. ఉక్కుకోటలో అయిదు వందల వెలగచెట్లు, మూడువందల మునగచెట్లు, తొమ్మిది వందల తాడిచెట్లు, అయిదువందల వేపచెట్లు. వీటన్నిటి మధ్యా ముంతమామిడి చెట్టు. ముంతమామిడి చెట్టు తొర్రలో ఏడు దొంతర్లు. అన్నిటికన్నా అడుగు దొంతర్లో బంగారు పంజరం. పంజరంలో పంచవన్నెల చిలుక. చిలుక కంఠంలో నా ప్రాణం ఉంది. ఆ చిలుక చస్తేనే గాని నేను చావను," అని చెప్పాడు మాయలఫకీరు.

బాలనాగమ్మ ముఖం పైకి విప్పారింది గాని లోపల ఆమెకున్న ఆశలన్నీ ఒక్కసారిగా అడుగంటాయి. తన కొడుకు, పసివాడు. ఇంకా మిగిలి ఉన్న ఎనిమిది రోజుల్లో సప్తసముద్రాలు దాటిపోయి, ఈ కోటలన్నీ దాటి ఆ చిలకను పట్టుకునేదేమిటి, ఫకీరు చచ్చేదేమిటి, తనను చెర విడిపించేదేమిటి?

అయినా ఫకీరు చెప్పినదంతా చీటీమీద వ్రాసి బాలనాగమ్మ తంబళ్ళపెద్ది ద్వారా

తన కొరుక్కు అందజేసింది. ఆ ఉత్తరం చూస్తూనే బాలవర్ధిరాజు తంబళ్ళపెద్దితో, ''అవ్వా, మా నాన్నకు రావలసిన బాకీలు కొన్ని వసూలు చేసుకువస్తాను. పత్రాలు గడువు దాటిపోతున్నాయి. ప్రయాణాని కింత అన్నంకట్టు ''అన్నాడు.

తంబళ్ళపెద్ది నిజమే ననుకుని బాలుడి కింత అన్నం మూట గట్టి ఇచ్చింది. అది తీసుకుని బాలుడు నడక సాగించి దొంతిరాజు పట్టణమూ, రక్తకొల్లూ గడిచి సముద్ర తీరానికి చేరుకున్నాడు. సముద్రం వొడ్డున పన్నెండు కొమ్మల మర్రి చెట్టుకింద విశ్రాంతి తీసుకుని ఆలోచించసాగాడు.

''అప్పుడే తల్లి పెట్టిన గడువులో రెండు మూడు రోజులు గడిచాయి. ఒక పడవగాని, తెప్పగాని లేకుండా ఎట్లా సముద్రం దాటటం? గడువయిపోయినాక మాయలఫకీరు ఒక్క క్షణం ఆగుతాడా? ఏం దారి? అని బాలుడు చింతించ సాగాడు.





బాలుడీవిధంగా ఆలోచిస్తూ ఉండగా చెట్టుమీదనుంచి ఏదో పక్షుల అరుపులు ఆర్తనాదంలాగా వినిపించాయి. బాలుడు తల ఎత్తి చూచేసరికి ఒక పెద్ద నాగసర్పం చెట్టెక్కుతూ కనిపించింది. బాలుడు వెంటనే లేచి చంద్రాయుధం తీసి పాము శిరస్సుమీద ఒక్క దెబ్బ వేశాడు. ఆ దెబ్బకు పాము అతనిమీద దూకి అతన్ని కాటువేసి ప్రాణం విడిచింది. ఆ విషం బాలుడి శరీరంలోకి పోయి మైకం కమ్మింది. శరీరం కొయ్యబారిపోయింది. నోట నురుగులు కక్కుతూ బాలుడు కాస్తా ప్రాణాలు విడిచాడు.

ఎప్పుడైతే బాలవద్దిరాజు ఇక్కడ ప్రాణాలు విడిచాడో అప్పుడే అక్కడ పానుగంటిపట్టణంలో అతను నాటిన నాగమల్లిచెట్టు మాడిపోయింది. అతను చచ్చిపోయినాడని తెలుసుకుని అతని ఆరుగురు తల్లులూ గోడుగోడున ఏడవసాగారు.

ఇది జరిగిన కొంతసేపటికి రెండు గండభేరుండపక్షులు ముక్కున ఏనుగును కరుచుకుని, సముద్రంమీదిగా మర్రిచెట్టు దగ్గిరికి ఎగురుతూ వచ్చాయి. బాలవద్దిరాజు ఈ పక్షులపిల్లలనే పాము బారినుండి రక్షించి తన ప్రాణాలర్పించాడు.

ఈ గండభేరుండపక్షులు అదివరలో చాలాసార్లు బిడ్డలను కనటమూ, వాటిని నాగేంద్రుడు కబళించడమూ జరిగింది. ఈసారి పిల్లలు ప్రాణాలతో దక్కాయి. చెట్టుకింద చచ్చిపడిఉన్న పాము కనిపించింది. దానిని చంపిన కుర్రవాడు కూడా చచ్చిపడి ఉండటం అవి చూశాయి.

ఇది చూడగానే ఒకపక్షి ఎగురుకుంటూ సంజీవి పర్వతానికి వెళ్ళి మర్నాడు తెల్లవారేసరికి ఒక సంజీవి పుల్లను తెచ్చింది. అది ముక్కున కరుచుకుని మూడుసార్లు బాలుడిచుట్టూ తిరిగేసరికి బాలుడు నిద్ర

లేచినట్టు లేచి కూర్చున్నాడు. మరుక్షణమే పానుగంటిపట్టణంలో నాగమల్లి చెట్టు చిగిర్చసాగింది.

బాలుడి తల్లుల ఆనందానికి మేరలేదు. వాళ్లారోజు దానాలూ, ధర్మాలూ, సంతర్పణలూ చేసుకున్నారు.

"నాయనా, మా పిల్లలప్రాణాలు కాపాడావు. మేము నీకేమి ఉపకారం చెయ్యగలమో చెప్పు," అని గండభేరుండపక్షు బాలుణ్ణి అడిగాయి.

"నాకు జీవిగడ్డలో పని ఉంది?" అన్నాడు బాలుడు.

"మేమూ నిత్యమూ అక్కడికి పోతూ ఉంటాము. మాతో రా!" అన్నాయి పక్షులు.

మగపక్షి ఒక తాటిదూలం తెచ్చి ముక్కుతో మధ్య డొల్లచేసింది. అందులో బాలుడు పడుకున్నాడు. రెండు పక్షులూ తాటిదూలం చెరొకవైపునా కరుచుకుని ఎగిరిపోసాగినై.

అవి అలా ఎగురుతూ, సప్తసముద్రాలూ దాటి, రాతిగోడ దాటి, రాతికోట దాటి, ఇనపకోట మధ్య ఆరణ్యంలో అతన్ని దించాయి.



ఆ ఆరణ్యం చాలా దట్టంగా ఉంది. బాలుడు తల్లి పేరు తలుచుకుని చంద్రాయుధంతో ఒక్కొక్క వేటుకు ఒక్కొక్క చెట్టు పడగొట్టుతూ ముంతమామిడిచెట్టు చేరుకున్నాడు. దానినికూడా ఒక్క వేటుతో పడగొట్టాడు. దొంతులూ కనిపించాయి.

ఇంతలో గండభేరుండపక్షులు, "అదేమిటి? ఆ చెట్టుజోలి కెందుకు పోతున్నావు? అందులో మాయల ఫకీరు ప్రాణం ఉంది, దానిజోలికి పోతే ఫకీరు నిన్ను చంపేస్తాడు," అని చెప్పాయి.

"ఫకీరే నన్ను తనప్రాణం తెమ్మన్నాడు. నేనాయన నౌకరును," అన్నాడు బాలుడు.



"ఎట్లా తెస్తావు? ప్రతి దొంతిలోనూ ఇనపకందిరీగలున్నాయి. అవి కుడితే చచ్చిపోతావు," అని పక్షులు చెప్పాయి.

"వాటిని కత్తితో చంపేస్తాను" అన్నాడు బాలుడు.

"వాటి రక్తం చుక్క కింద పడితే వెయ్యేసి కందిరీగలు పుడతాయి. ఎట్లా చంపుతావు? చాల్లే. వెనక్కు పోదాం రా!" అని పక్షులు సలహా ఇచ్చాయి.

"నేనిక్కడ చచ్చి అయినా పోతాను గాని ఫకీరు ప్రాణం తేకుండా తిరిగి రాను, మీరు వెళ్లిపొండి," అని బాలుడు మొండికెత్తాడు.

గండభేరుండ పక్షులు బాలుడి కోర్కె తీర్చటానికి ఒక మంచి ఉపాయం చేశాయి. పోతుపక్షి బాలుణ్ణి ఒక దట్టమైన పొదలో కూర్చోబెట్టి వచ్చింది. ముంత మామిడి చెట్టును మూడు తాపులు తన్నింది. ఆ దెబ్బకు దొంతులు పగిలి గండుతుమ్మెదలు రివ్వున లేచాయి. అప్పుడు పెంటిపక్షి బలంకొద్దీ తన రెక్కను విసిరింది. ఆ గాలి తాకిడికి గండుతుమ్మెదలు ఎన్నోమైళ్లు కొట్టుకుపోయాయి. పోతుపక్షి చెట్టు తొర్రలో ఉన్న పంజరం ముక్కున కరుచుకుని తీసుకుపోయి దాన్ని పొదలో ఉన్న బాలుడికిచ్చింది.

"అబ్బాయీ, ఫకీరువాడికి ఈపాటికి తెలిసివుంటుంది. తన ప్రాణాన్ని రక్షించుకునేటందుకు వాడు బయలుదేరి వస్తాడు. నీ ప్రాణమూ మా ప్రాణమూ కూడా దక్కదు. అందుచేత ఆ చిలకను ఇప్పుడే స్వాధీనపరుచుకో," అని గండభేరుండ పక్షులు బాలవర్ధిరాజుకు హెచ్చరిక చేశాయి.

బాలుడు పంజరంలోనుంచి చిలకను తీసి, తన చెవి పోనలు రెండూ దాని



కాళ్ళకు తొడిగి రెంటికీ కొక్కెం తగిలించాడు. దానితో మాయలఫకీరు కాళ్లు పడిపోయాయి.

"నా ప్రాణం ఎవడో అపహరించాడు, లేదా నా చిలక మేతకు పోయి ఏ లతలకో కాళ్లు ఇరికించుకున్నది," అనుకున్నాడు మాయలఫకీరు.

ఈలోపుగా ఈతబొండులో బాలవర్ధిరాజును కూర్చోబెట్టి గండభేరుండపక్షులు ఇంటిదారి పట్టాయి. సముద్రాలన్నీ దాటి మర్రిచెట్టు చేరుకున్నాయి. పిల్లలకు మేత బెట్టి బాలుణ్ణి మళ్లీ తీసుకుపోవటానికి సిద్ధపడ్డాయి. కాని బాలుడు కాలినడకను తానే వెళ్లిపోతానని పక్షులదగ్గిర సెలవు పుచ్చుకున్నాడు.

నాలుగురోజులు నడిచి బాలవర్ధిరాజు నాగళ్లపూడి గట్టు చేరి తంబళ్ళపెద్ద ఇంటికి వెళ్లాడు.

"బాకీలు వసూలు చేసుకు వచ్చావా" అని అడిగింది పెద్ద.

"బాకీవాళ్ళంతా పేరారి అయినారు. పత్రాలు చింపేశాను" అన్నాడు బాలుడు. అవ్వ లబోమని మొత్తుకున్నది.

"ఊరుకో, అవ్వా. రోజులు కలిసి వస్తే ఈ కోటలో సొత్తంతా మనదే అవుతుంది." అంటూ బాలుడు గాండ్లసంగు ఇంటికి పోయినాడు. గాండ్లసంగు నువ్వులు గానుగ ఆడుతున్నది. బాలుడు చిలకను చేత్తో పట్టుకుని ఎగిరి గానుగమీద ఎక్కి తిరగసాగాడు. వెంటనే బయట తోటలో ఉన్న మాయలఫకీరుకూడా గుండ్రగా తిరగసాగాడు. బాలుడు గానుగను ఇంకా వేగంగా తిప్పాడు, ఫకీరుకూడా ఇంకా వేగంగా తిరిగాడు.

బాలుడు చిలకను చేత బట్టుకుని ఫకీరుదగ్గిరికి పోయినాడు.



"అరే, నువ్వు నా ప్రాణం తెచ్చావు. నాది నా కిచ్చెయ్యి," అన్నాడు ఫకీరు.

"కొంచెం ఆగరా, ఫకీరూ! బాల నాగమ్మ నీకేమవుతుంతది?" అన్నాడు బాలుడు.

"అది నా పెళ్లాంరా," అన్నాడు ఫకీరు.

బాలుడికి పట్టరానంత కోపం వచ్చింది. చిలక కంఠం నొక్కాడు.

ఫకీరు లబలబలాడుతూ, "దాన్ని చంపకు. బాలనాగమ్మ నాకు తల్లి!" అన్నాడు.

"ఫకీరూ, నీదగ్గిర చాలా మంత్రాలూ, భూతాలూ ఉన్నాయిట. వాటిని కాస్త నాకుకూడా చెప్పు." అన్నాడు బాలుడు.

"నా రహస్యాలు నేనెవరికీ చెప్పను." అన్నాడు ఫకీరు.

"చెప్పకపోతే ఈ చిలకను చంపేస్తాను" అని బెదిరించాడు బాలుడు.

దేవుడా అంటూ ఫకీరు తన రహస్యాలన్నీ బాలవద్దిరాజుకు చెప్పాడు. దుడ్డు కర్రా, గోటచిప్పా, తన మంత్రపు బెత్తాలూ ఎట్లా ఉపయోగించాలో బాలుడికి నేర్పాడు. రాళ్లూ రప్పలూ అయిపోయి కోటచుట్టూ

ఉన్న బాలవద్దిరాజు తండ్రులనూ, వారి సైన్యాలనూ బతికించాడు. వారందరికీ తాను ఎరుకచెప్పమన్నాడు.

బాలనాగమ్మ చెర అయిపోయింది. ఆమెను బాలుడు పల్లకీలో కూర్చోబెట్టి ఒకపక్క గాండ్లసంగునూ, ఇంకొకపక్క ఫకీరునూ మొయ్యమన్నాడు. చేసేదిలేక ఫకీరు పల్లకీ ఎత్తుకున్నాడు. అందరూకలిసి తంబళ్ళపెద్దుతోసహా బయలుదేరారు.

నాగళ్లపూడిగట్టు దాటి, నయనవాది పట్నం దాటి వీరంతా చిలుకవాదిపట్నం చేరారు.

అక్కడ బాలుడు తాను బతికించిన రాజు కూతుర్ని తల్లిదండ్రుల అనుమతితో మహా వైభవంగా పెళ్లాడాడు. అక్కడి నుండి బయలుదేరి గంగవాదిపట్నం వచ్చి ఆ రాజుకూతుర్నికూడా పెళ్లాడాడు. ఆ తరవాత పులిరాజుపట్నం చేరి పులిరాజు కూతుర్నికూడా పెళ్లాడాడు. అక్కడినుండి బయలుదేరి అందరూ పానుగంటిపట్నం చేరుకున్నారు.

బాలుడికొరకు ఎదురుచూస్తున్న ఆరుగురు తల్లుల ఆనందానికి మేరలేదు. ఫకీరువాతపడిన బాలనాగమ్మ తిరిగి రావటం కాకుండా చచ్చారనుకున్న



ముగుళ్లూ చుట్టాలూ తిరిగివచ్చారు. ఆరుగురు అక్కచెల్లెళ్లూ గాజులబత్తుడి చేత గాజులు తొడిగించుకున్నారు. వారి వైధవ్యం అయిపోయింది.

ఇంత ఆనందంలోనూ ఒక చిక్కు ఎదురయింది. బాలనాగమ్మ భర్త కార్యవద్ది రాజు, "ఇది ఇంతకాలం ఫకీరుదగ్గిర ఉన్నది. ఇది వ్రతం చెడలేదని ఎలా నమ్మటం? నేను బాలనాగమ్మను ఏలను" అన్నాడు.

అప్పుడు బాలవద్దిరాజు సలసల కాగే నూనెలో తన ఉంగరం వేసి తల్లిని తీయమన్నాడు. బాలనాగమ్మ తీసింది.

"ఫకీరుదగ్గిర ఇది ఎన్ని మాయలూ, పనర్లూ నేర్చిందో? నేను నమ్మను," అన్నాడు కార్యవద్దిరాజు.

బాలుడు పెద్ద అగ్నిగుండం తయారు చేయించాడు. బాలనాగమ్మ అందులోకి దూకింది. కట్టినకోక కాలలేదు, పెట్టిన కుంకం చెదరలేదు. బాలనాగమ్మ ఆ గుండంలో నాలుగు గడియలు నిలబడి పైకి వచ్చింది. ఆమె భర్త ఆనందానికి మేరలేదు.

బాలవద్దిరాజు ఏడుగురు తల్లులూ, తండ్రులూ మళ్లా వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఈ సంబరాలన్నీ అయిపోగానే బాలవద్దిరాజు మాయలఫకీరును వెంట బెట్టుకుని నాగళ్లపూడి గట్టుకు వెళ్లాడు. కోటలో ఉండే సామానంతా బళ్లమీద తన వూరు చేరవేయించాడు.

ఫకీరు, "ఇకనన్నా నా చిలకను నాకిచ్చెయ్యి," అన్నాడు. బాలుడు ఇవ్వనన్నాడు. ఫకీరు ఆత్రంగా బాలవద్దిరాజు చేతిలోంచి చిలకను లాక్కోబోయినాడు. చిలక తల బాలవద్దిరాజు చేతిలో మిగిలిపోయింది. మొండెం ఫకీరు చేతిలోకి వచ్చింది. 'యాఅల్లా, యాఖుదా' అంటూ మాయలఫకీరు ప్రాణాలు విడిచాడు.

బాలవద్దిరాజు బళ్ళకెక్కించిన సామానులు తిరిగి తెప్పించి, ఫకీర్లను పిలిపించి అన్నదానాలు చేసి, ఒక పెద్ద తోట వేయించి అందులో ఫకీరుకు గోరీ కట్టించి, గోరీదగ్గిర పెద్ద కొట్టు కట్టించి, అందులో ఫకీరు ఆస్తి అంతా ఉంచాడు. ఫకీరుపేర నిత్యమూ సాంబ్రాణి వేయటానికి ముప్పై మంది ఫకీర్లను పెట్టి ఆ ఆస్తి వారిని అనుభవించమన్నాడు.

బాలుడు ఇంటికి వచ్చి అత్తవారిచ్చిన ఆరు రాజ్యాలూ ఏలుతూ తల్లులతోనూ తండ్రులతోనూ సుఖంగా జీవించాడు.

(అయిపోయింది)

